నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దిన పత్రిక

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 99 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | ఆదివారం | 6-7-2025 | వెల : .రూ. 5.00



# ట్రంప్‌కు మోదీ తలొగ్గుతారు

- యూఎస్-భారత్ ట్రేడ్ డీల్‌పై రాహుల్ గాంధీ విమర్శ

న్యూఢిల్లీ :జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. భారత్-అమెరికా ట్రేడ్ డీల్ విషయంలో ప్రధాని మోదీ.. అధ్యక్షుడు ట్రంప్ ముందు లొంగిపోతారని వ్యాఖ్యానించారు. 'అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాలకు ప్రధాని మోదీ తలొగ్గుతారు. ఈ విషయంలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ గుండెలు బాదుకోవడం తప్ప ఏమీ చేయలేరు. నా మాటలు నమ్మకపోతే రాసిపెట్టుకోండి'

-మిగతా 2 లో



# కోటి మహిళలను కోటీశ్వరులను చేస్తాం

- అద్దె బస్సులు అందించిన మహిళా సంఘాలకు చెక్కులు
- ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భట్టి

హైదరాబాద్,
అవకాశం ఉన్న ప్రతిచోట మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తామని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. తమ ప్రభుత్వం మహిళా సంఘాలకు అండగా ఉంటుందని చెప్పారు. ప్రజాభవన్‌లో ఇందిరా మహిళా శక్తి సంబరాలు నిర్వహించారు. ఆర్టీసీకి అద్దె బస్సులు అందించిన మహిళా సంఘాలకు చెక్కులు పంపిణీ చేశారు. తొలి నెల అద్దె కింద రూ.1.49 కోట్లు- ఆయా సంఘాలకు.. మంత్రులు భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, సీతక్క అందించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మహిళలు వ్యాపారవేత్తలుగా రాణించేందుకు

-మిగతా 2 లో




## చిన్నారులపై లైంగిక దాడి కేసుల్లో

# కఠిన శిక్షలు

## పిల్లలు, మహిళల రక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాం



- సామాజిక మాధ్యమాల విషయంలో జాగ్రత్తలు
- లైంగిక వేధింపుల నుంచి పూర్తిస్థాయి రక్షణకు చర్యలు
- లైంగిక దాడులపై సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
చిన్నారులు, మహిళల భద్రతకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. భరోసా కేంద్రాల ద్వారా బాధితులకు అండగా ఉంటున్నట్లు చెప్పారు. 'లైంగిక దాడుల బాధిత చిన్నారుల రక్షణ, భద్రత'

-మిగతా 2 లో




అమెరికాలో స్వాతంత్ర్య

# దినోత్సవ వేడుకలు..

వైట్‌హౌస్ మీదుగా దూసుకెళ్లిన B2 బాంబర్స్

న్యూఢిల్లీ :జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
గ్రరాజ్యం అమెరికా స్వాతంత్ర్య దినోత్సవం .ఈ సందర్భంగా దేశ వ్యాప్తంగా ప్రజలు ఈ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. బాణాసంచా కాలుస్తూ, కవాతుల మధ్య సందడిగా జరుపుకున్నారు. అధ్యక్షుడి అధికారిక నివాసం వైట్‌హౌస్‌లో సైతం స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా B2 స్టెల్త్ బాంబర్స్ వైట్‌హౌస్ మీదుగా దూసుకెళ్లాయి. వాటికి బాల్కనీ నుంచి సతీమణి, ఫస్ట్‌లేడీ మెలానియాతో కలిసి ట్రంప్ (సెల్యూట్ చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోని వైట్‌హౌస్ ఎక్స్ వేదికగా పోస్టు చేసింది. ప్రస్తుతం ఈ వీడియో వైరల్ అవుతోంది.అమెరికా అమ్ములపొదిలోని అత్యాధునిక, వ్యూహాత్మక ఆయుధాల్లో ఒకటి. వీటిని ఇటీవలే

-మిగతా 2 లో



# తెలంగాణలో అప్పటిదాకా వానలే..

వెల్లడించిన వాతావరణశాఖ

హైదరాబాద్,
తెలంగాణలో ఈ నెల 9వ వరకు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పింది. శనివారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు పడే సూచనలున్నాయని చెప్పింది. ఆదివారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల,

-మిగతా 2 లో



# రోజుకు 10 గంటలు పని

- తెలంగాణ సర్కార్ కీలక ఉత్తర్వులు ..

హైదరాబాద్,జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
వాణిజ్య కేంద్రాల్లో ఉద్యోగుల పని వేళల పరిమితిని తెలంగాణ ప్రభుత్వం సవరించింది. రోజుకు 10 గంటల వరకు పని చేసేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వారంలో పని వేళలు 48 గంటలు మించరాదని స్పష్టం చేసింది. పరిమితి

-మిగతా 2 లో



# స్టాంప్ సవరణ చట్టం కోసం కసరత్తు

అసెంబ్లీలో సవరణకు నిర్ణయం
అధికారులతో సమీక్షలో మంత్రి పొంగులేటి

హైదరాబాద్,
రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా సాధారణ ప్రజలకు నష్టం కలిగించకుండా వ్యాపార ఒప్పందాలపై పారదర్శకత ఉండేలా స్టాంప్ విధానాన్ని అమలు చేయాలనుకుంటున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఇందుకు అనుగుణంగా తెలంగాణ సవరణ బిల్లు-2025ను తీసుకురావాలని నిర్ణయించినట్లు పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఈ బిల్లును తీసుకువచ్చేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని వెల్లడించారు. ఈ సవరణ బిల్లుపై శనివారం నాడు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో

-మిగతా 2 లో



# అసెంబ్లీలోనే చర్చిద్దాం రండి

- ఏ అంశమైనా చర్చకు మేం సిద్ధం
- బనకచర్ల కావచ్చు..మరేదైనా కావచ్చు
- ప్రెస్‌క్లబ్ కాదు..అసెంబ్లీలో సరైన వేదిక
- కేటీఆర్ వ్యాఖ్యలపై మంత్రి పొన్నం స్పందన

హైదరాబాద్ జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
ఏ అంశమైనా చర్చకు అసెంబ్లీ దేవాలయం లాంటిదని, అక్కడే అన్ని విషయాలు చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సవాల్ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. బనకచర్ల , రాష్ట్రంలో అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలకు సంబంధించి ప్రతిపక్ష నాయకుడు

-మిగతా 2 లో

## 72 గంటల్లో రా..

# తేల్చుకుందాం.

## రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్

సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఈనెల 8న సిద్ధంగా ఉంటా
ఎవరు రైతులకు మేలు చేశారో...చేయలేదో తేలుస్తాం
ఈ చర్చ కు కేసీఆర్ అవసరం లేదు...నేను చాలు
మీడియా సమావేశంలో రేవంత్‌కు కేటీఆర్ ప్రతిసవాల్

హైదరాబాద్ జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
వ్యవసాయంపై ఎక్కడ చర్చ పెట్టినా రావడానికి సిద్ధమని బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ నేతలతో కలిసి ఆయన మాట్లాడారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఈనెల 8న సిద్ధంగా ఉంటానని, సీఎం రేవంత్‌రెడ్డి చర్చకు

-మిగతా 2 లో



# చిన్నారులపై లైంగిక దాడి కేసుల్లో కఠిన శిక్షలు

(మొదటి తరువాయి)

అంశంపై హైదరాబాద్‌లో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. చిన్నారులపై లైంగిక హింసను అందరూ ఖండించాలన్నారు. ఇలాంటి కేసుల్లో నిందితులను కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల విషయంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సదస్సులో సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ సూర్యకాంత్, హైకోర్టు న్యాయమూర్తులు, డీజీపీ జితేందర్, పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. స్టేట్ లెవెల్ స్టేక్ హోల్డర్స్ కన్సల్టేషన్ మీట్-2025 కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. వాయిస్ ఫర్ ది వాయిస్ లెస్ అనే థీమ్ తో.. తమ బాధను చెప్పుకోలేని వారికి రక్షణ కల్పించేందుకు ప్రస్తుత పరిస్థితుల్లో ఇలాంటి రాష్ట్రస్థాయి సమావేశం ఏర్పాటు చేయడం చాలా అవసరం అన్నారు. ఎంతో కీలకమైన అంశంపై సదస్సు నిర్వహిస్తున్న తెలంగాణ పోలీసు, ఇతర నిర్వాహకులను అభినందిస్తున్నా.. ఇలాంటి నేరాలను నియంత్రించడమే కాకుండా బాల బాధితులకు చట్టపరమైన అన్ని రకాల రక్షణ కల్పించాల్సి ఉంది. లైంగిక వేధింపుల నుంచి అన్ని రకాలుగా రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మా ప్రభుత్వం పిల్లలు, మహిళల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుంది. బాలికల సంరక్షణ కోసం తెలంగాణ భరోసా ప్రాజెక్టును తీసుకొచ్చిందన్నారు. అనుసంధానంగా 29 కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఈ కేంద్రాల ద్వారా పోలీసు సహాయమే కాకుండా న్యాయ పరమైన సహాయం, వైద్య సహాయం, కౌన్సెలింగ్ వంటి సేవలను అందిస్తున్నాయి. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న భరోసా కేంద్రం ద్వారా చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టులను ప్రారంభించిన మొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. కేసులను వేగవంతంగా పరిష్కరించడమే కాకుండా పిల్లలకు సంపూర్ణ రక్షణ, వారిలో విశ్వాసం, అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవడం ఈ కేంద్రాల లక్ష్యం అని వివరించారు. పోక్సో చట్టం, జ్యువెనైల్ చట్టాలు మన ప్రగతిశీల సాధనాలుగా పనిచేస్తున్నాయి. అయితే ఆచరణలో కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయి. ఆ చట్టాలు బాధితులకు ఎలాంటి హాని కలిగించకుండా, వారి భవిష్యత్తుకు రక్షణగా సంపూర్ణ సహాయకారిగా ఉండాలి. సోషల్ మీడియా ద్వారా పిల్లలపై జరిగే దురాగతాలు, దుర్వినియోగం చేస్తున్న వారి పట్ల ఎలాంటి కరుణ చూపకుండా దోషుల విషయంలో కఠినంగా వ్యవహరించాలి. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉంది. న్యాయం కేవలం కోర్టుల్లోనే కాకుండా ప్రతి దశలోనూ రక్షణ ఉండాలి. పోలీస్ స్టేషన్, బాలల సంక్షేమ కేంద్రాలతో అన్ని ప్రక్రియల ద్వారా పిల్లలకు న్యాయం దక్కాలి. రక్షణ కల్పించాలని సిఎం అన్నారు. గౌరవ న్యాయమూర్తులు, పోలీసు అధికారులు బాలల సంక్షేమ కమిటీ-లు, ఇతర అభివృద్ధి భాగస్వామ్య సభ్యులందరికీ... విజ్ఞప్తి చేస్తున్నాను. ఇలాంటి విషయాల్లో అందరం కలిసికట్టు-గా ముందుకు సాగుదాం. న్యాయమంటే కేవలం శిక్షలు విధించడం వరకే కాదు. బాధితుల జీవితానికి భరోసా కల్పించాలి. వారికి అవసరమైన రక్షణ, సమాజంలో తగిన గౌరవం కల్పించేలా చర్యలు తీసుకుని వారి బాల్యాన్ని తిరిగి పొందేలా చర్యలు ఉండాలని అన్నారు.

# 72 గంటల్లో రా.. తేల్చుకుందాం..

(మొదటి తరువాయి)

రావాలన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పాలనపై కేటీఆర్ ధ్వజమెత్తారు. రైతుల బాగుపై కాంగ్రెస్ పార్టీ నేతల మాటలు.. దయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందని ఎద్దేవా చేశారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఎరువులు, విత్తనాల కోసం రైతులు క్యూలైన్లలో చెప్పులు పెట్టడమేనా అని ప్రశ్నించారు. కొత్త రాష్ట్రాన్ని కేంద్రం ఇబ్బందులు పెట్టినా కేసీఆర్ నిలబడ్డారని గుర్తు చేశారు. తెలంగాణను కోటి ఎకరాల మాగాణిగా మార్చిన ఘనత కేసీఆర్‌దేనని అన్నారు. నీటికి పల్లం ఎలా తెలుసో తెలంగాణ కు నీరు ఎవరు తీసుకు వచ్చారో అందరికి తెలుసు.. తెలంగాణ లో ఏ రైతును, ఎద్దును అడిగినా వ్యవసాయం పండుగ ఎవరు చేశారో చెప్తారు.. సీఎం నిన్న రంకెలు వేశాడు.. ఆయన సభ పెట్టాడంటే బూతులతోనే మాట్లాడతాడు.. మా పార్టీ తరుపున మీ సవాలు స్వీకరిస్తున్నాం.. ఎక్కడ చర్చ పెట్టినా వస్తాం.. మీకు కేసీఆర్ అవసరం లేదు.. మేము చాలు.. 72 గంటలు ఇస్తున్నాం.. మీరు ప్రిపేర్ అయి రండి.. సీఎంకు బేసిన్ లు తెలియదు బెండకాయలు తెలియదు.. సమైక్య రాష్ట్రంలో నీళ్లు ఇవ్వలేదు కాబట్టే తెలంగాణ ఉద్యమం పుట్టింది..సీఎం



రేవంత్ రెడ్డి హయాంలో నీళ్లు ఆంధ్రకు, నిధులు ఢిల్లీకి, నియామకాలు ఆయన అనునాయులకు వచ్చాయని అంటూ విమర్శలు గుప్పించారు. ఇందిరమ్మ రాజ్యం గొప్పతనం తెలియాలి అంటే బట్టలు విప్పి కొడతాం అన్నారు.. బనకచర్ల ద్వారా మీ గురువు చంద్రబాబు తీసుకెళ్తుంటే మీ తీరు తెలంగాణ సమాజం చూస్తూనే ఉంది. బురద జల్లి తప్పించుకునే అలవాటు సీఎం కి ఉంది.. 8 వ తారీఖు 11 గంటలకు సోమజిగూడా ప్రెస్ క్లబ్ కు మేము వస్తాము.. మీరు రండి మీడియా ముందే చర్చిద్దాం.. కేసీఆర్ ప్రభుత్వం నాట్లు వచ్చినప్పుడు రైతు బంధు ఇచ్చేది... ఓట్లు వచ్చేముందు రైతు భరోసా ఇస్తుంది కాంగ్రెస్.. ఇప్పటి వరకు రైతులకు ఎకరానికి 19 వేలు ఎగ్గొట్టారు. అన్నదాతకు సున్నం పెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వం.. మందికి పుట్టిన బిడ్డలు నా బిడ్డలు అనడానికి సిగ్గు లేదా.. మేము ఇచ్చిన ఉద్యోగాలు మీరు ఇచ్చినట్లు- చెప్పుకుంటున్నారు.. అశోక్ నగర్ లో చర్చకు వస్తావా.. ఈ మూడు రోజులు మీకు టైం ఇస్తున్నాం.. అప్పటివరకు మీరు చెప్పకుంటే.. 8వ తేదీన మేము సోమజిగూడా ప్రెస్‌క్లబ్ లో సిద్ధం గా ఉంటాం.. మీలాగా మందబలంతో కాకుండా 10,15 మందితో వస్తాం.. ఈయన ఇచ్చే డబ్బులతో ఢిల్లీ టకీ టకీ అని మోగుతున్నాయి.. కాంగ్రెస్ ఎమ్మెల్యే చెప్పినట్లు- చంద్రబాబు కోవర్ట్ రేవంత్ రెడ్డినే.. ఆ ఎమ్మెల్యే చాలా కరెక్టు గా చెప్పాడు.. అలా చెప్పిన ఎమ్మెల్యేను అభినందిస్తున్నాను అని కేటీఆర్ తెలిపారు.

# స్టాంప్ సవరణ చట్టం కోసం కసరత్తు

(మొదటి తరువాయి)



ముఖ్యమంత్రి కార్యాలయ ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్.లోకేష్ కుమార్, న్యాయ వ్యవహారాల కార్యదర్శి రెండ్ల తిరుపతి, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు, ముఖ్యమంత్రి కార్యాలయ ఒఎస్డి వేముల శ్రీనివాస్ తదితరులతో సమావేశం నిర్వహించారు.

భారతీయ స్టాంపు చట్టం 1899 ప్రకారం, తెలంగాణ పరిధిలో నాలుగు సెక్షన్లను మరియు 26 ఆర్టికల్స్ ను సవరించుట కొరకు 2021 సంవత్సరంలో శాసనసభలో సవరణ బిల్లును ఆమోదించి కేంద్రప్రభుత్వం ఆమోదం కొరకు పంపడం జరిగిందని అయితే ఈ బిల్లుపై కేంద్రం వ్యక్తం చేసిన అభ్యంతరాలకు సమాధానం ఇచ్చినప్పటికీ 2023 జనవరిలో భారత ప్రభుత్వం ఈ సవరణ బిల్లును రాష్ట్ర ప్రభుత్వానికి తిరిగి పంపించడం జరిగిందని ఈ సందర్భంగా అధికారులు మంత్రి దృష్టికి తీసుకవచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2021లో ప్రవేశపెట్టిన సవరణ బిల్లును ఉపసంహరించుకొని ప్రస్తుత కాలానికి అనుగుణంగా 2025 సవరణ బిల్లును తీసుకురావాలని నిర్ణయించినట్లు- వెల్లడించారు. సామాన్య ప్రజలను దృష్టిలో పెట్టుకుని, నిబంధనలు కట్టుదిట్టమైన రూపంలోకి తీసుకురావడం కొత్త ఒప్పందాలకు చట్టబద్ధత కల్పించడం లక్ష్యంగా బిల్లును రూపొందించాలని అలాగే పాత చట్టంలో లేనివాటిని కొత్త చట్టం పరిధిలోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. వచ్చే శాసనసభ సమావేశాల్లో ఈ సవరణ బిల్లును ప్రవేశపెట్టాలని సూచించారు. సామాన్య మధ్యతరగతి ప్రజానీకంపై ఎలాంటి భారం పడకుండా ప్రస్తుత మార్కెట్ విలువలకు అనుగుణంగా భూముల ధరలను సవరించాలని ఇందుకు అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఎలాంటి విమర్శలకు తావులేకుండా శాస్త్రీయ పద్ధతిలో భూముల ధరల సవరణ జరగాలన్నారు. ఏఏ ప్రాంతాల్లో ఎక్కువ వ్యత్యాసం ఉంది అక్కడ హేతబద్ధంగా ఎంత శాతం పెంచేందుకు అవకాశం ఉంది తదితర అంశాలపై లోతైన అధ్యయనం చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళాభ్యదయం కోసం ఎన్నో చర్యలు చేపడుతోందని దీనిలో భాగంగా మహిళలకు స్టాంప్ డ్యూటీ- తగ్గించాలన్న ఆలోచన చేస్తున్నామని అలాగే కొత్త, పాత అపార్ట్‌మెంట్ లకు స్టాంప్ డ్యూటీ- ఒకే విధంగా ఉందని పాత అపార్ట్ మెంట్‌లకు రిజిస్ట్రేషన్ తేదీలను పరిగణనలోకి తీసుకొని స్టాంప్ డ్యూటీ- తగ్గించాలన్న ఆలోచన చేస్తున్నామని ఈ రెండు అంశాలపై గౌరవ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించి విధివిధానాలపై తుది నిర్ణయం తీసుకుంటామన్నారు.

# అసెంబ్లీలోనే చర్చిద్దాం రండి



(మొదటి తరువాయి)

కేసీఆర్ శాసనసభ స్పీకర్‌కి లేఖ రాస్తే అసెంబ్లీలో చర్చకు సిద్ధమని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. విదేశాలకు వెళ్లడంతో ఈ విషయం కేటీఆర్‌కి తెలియకపోవచ్చని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజలకు వాస్తవాలు తెలియాలంటే దేవాలయం లాంటి అసెంబ్లీలో చర్చ జరగాలని అన్నారు. ఎక్కడో ప్రెస్‌క్లబ్‌లో ఇలాంటి చర్చలు సహేతుకం కాదన్నారు. అసెంబ్లీలో చర్చకు సిద్ధమని సవాల్ చేయాల్సిన కేటీఆర్ ప్రెస్ క్లబ్‌లో చర్చ చేద్దాం అంటున్నారని ఎద్దేవా చేశారు. ప్రెస్ క్లబ్‌లో చర్చ చేయడం సరైన విధానం కాదు. తెలంగాణ ప్రజానీకానికి తెలియాలంటే అసెంబ్లీలోనే చర్చ జరగాలి. చర్చకు మేము సిద్ధమని స్పష్టం చేశారు. కేటీఆర్‌కు సవాల్ విసురుతున్నా.. చర్చ బషీర్ బాగ్‌లో కాదు శాసన సభలో చేద్దాం. ప్రత్యేక అసెంబ్లీ సమావేశం ఏర్పాటు చేయండని కేసీఆర్‌తో లేఖ రాయించండని సూచించారు. బనకచర్లకు పునాది వేసింది బీఆర్ఎస్.. బేసిన్లు, భేషజాలు లేవని ఏపీకి నీటిని కట్టబెట్టింది ఆ పార్టీనేనని ఆరోపించారు. గతంలో ఏపీ మాజీ సీఎం జగన్‌తో నీటి ఒప్పందాలు చేసుకుంది ఎవరని ప్రశ్నించారు. పోతిరెడ్డిపాడు, బనకచర్లపై అప్పుడు మౌనంగా ఉన్నది ఎవరని నిలదీశారు. తెలంగాణకు అన్యాయం చేసింది ముమ్మాటికీ బీఆర్ఎస్ పార్టీనేనని విమర్శించారు. ఇవన్నీ మరచి సవాళ్లు చేస్తే ప్రజలు నమ్మరని అన్నారు. అలాగే కేసీఆర్ను అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొనమని చెప్పండన్నారు. మేము చర్చకు భయపడే వాళ్లం కాదన్నారు. అసెంబ్లీకి రాకుండా బయట సవాళ్లు చేయడం ఏంటని ఫైర్ అయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచి చూపిస్తామని కేటీఆర్ వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు.

# ట్రంప్‌కు మోదీ తలొగ్గుతారు

(మొదటి తరువాయి)

అని రాహుల్ వ్యాఖ్యానించారు.భారత ఉత్పత్తులపై అమెరికా ఇప్పటికే 10 శాతం టారిఫ్ విధిస్తున్న విషయం తెలిసిందే. అయితే, అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత ట్రంప్ భారత్ సహా పలు దేశాలపై అదనపు సుంకాలను ప్రకటించారు. ఏప్రిల్ 2న మన దేశంపై ట్రంప్ 26 శాతం అదనపు సుంకాన్ని విధిస్తున్నట్లు ప్రకటించారు. అయితే, అదనపు సుంకాలను జులై 9 వరకూ నిలిపివేస్తున్నట్లు ట్రంప్ యంత్రాంగం గతంలోనే ప్రకటించింది. అంతలోపు ఆయా దేశాలు మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాల్సి ఉంటుంది. లేదంటే, జులై 9 నుంచి అదనపు సుంకాలు వడ్డిస్తారు. అంతలోపే వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాలని ఇరు దేశాలూ భావిస్తున్నాయి. ఈ అదనపు 26 శాతం సుంకం నుంచి పూర్తిగా మినహాయింపు ఇవ్వాలని భారత్ కోరుతోంది. మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై ఇరు దేశాలూ తీవ్రంగా చర్చలు జరుపుతున్నారు. ఈ చర్చలు చివరి దశకు వచ్చినట్లు ఇటీవలే వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. వాణిజ్య ఒప్పందంలో ఇరు దేశాలూ వ్యవసాయం, ఆటోమొబైల్స్, ఇండస్ట్రియల్ గూడ్స్, లేబర్ ఇంటెన్సివ్ ప్రొడక్ట్‌లపైనే ఎక్కువగా దృష్టి పెట్టాయి. దేశంలో అధిక ఉపాధి కల్పించే తమ ఎగుమతులపై సుంకాలను గణనీయంగా తగ్గించాలని భారత్ ప్రతిపాదిస్తోంది. ముఖ్యంగా వస్త్రాలు, పాదరక్షలు, తోలు ఉత్పత్తుల ఎగుమతులపై అర్థవంతమైన రాయితీల కోసం భారత్ ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. వ్యవసాయం, డెయిరీ రంగాల్లోనూ తమ ఉత్పత్తులకు పూర్తిస్థాయి మార్కెట్ ప్రవేశం కల్పించాలని అమెరికా డిమాండ్ చేస్తోంది. కానీ, దేశంలోని గ్రామీణ జీవనోపాధి, ఆహార భద్రత దృష్ట్యా ఈ రెండు కీలక రంగాలను ఒప్పందం పరిధి నుంచి దూరంగా ఉంచాలని భారత్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈనెల 9వ తేదీలోగా.. ఇరుదేశాల మధ్య వాణిజ్య ఒప్పందం ఓ కొలిక్కి రానుంది. అయితే, రెండు దేశాలకూ ప్రయోజనకరంగా ఉంటేనే వాణిజ్య ఒప్పందాన్ని భారత్ అంగీకరిస్తుందని కేంద్ర మంత్రి పియూష్ గోయల్ వెల్లడించిన విషయం తెలిసిందే.

# కోటి మహిళలను కోటీశ్వరులను చేస్తాం

(మొదటి తరువాయి)

ప్రోత్సహిస్తున్నామన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నట్లు చెప్పారు. ఐదేళ్లలో వారికి రూ.లక్ష కోట్ల రుణాలు ఇవ్వాలనేది లక్ష్యమన్నారు. ఈ నెల 8న అన్ని మండలాల్లో ప్రభుత్వ కార్యక్రమాలపై చర్చించాలి. మహిళలకు ప్రభుత్వం కల్పిస్తున్న లబ్ధి గురించి చర్చించాలి. గ్రామాలు, మండలాల్లో మహిళా సమాఖ్య సమావేశాలు ఏర్పాటు- చేయాలి. ఈనెల 10 నుంచి 16 వరకు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సమావేశాలు ఉంటాయి. వడ్డీ లేని రుణాల నగదును చెక్కుల రూపంలో అందిస్తాం. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయంపై ప్రజలకు వివరించాలని భట్టి విక్రమార్క తెలిపారు

# రోజుకు 10 గంటలు పని

(మొదటి తరువాయి)

దాటితే ఓటీ వేతనం చెల్లించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. రోజులో 6 గంటల్లో కనీసం అరగంట విశ్రాంతి ఇవ్వాలని, విశ్రాంతితో కలిపి 12 గంటల కంటే ఎక్కువ పని చేయించరాదని ఆదేశించింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా పని వేళలు సవరించినట్లు ప్రభుత్వం వెల్లడించింది.

### అమెరికాలో స్వాతంత్ర్య

# దినోత్సవ వేడుకలు..

(మొదటి తరువాయి)

ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధంలో అగ్రరాజ్యం ఉపయోగించిన విషయం తెలిసిందే. టెహ్రాన్‌లోని ఫోర్డో, నతాంజ్, ఇస్ఫాహన్‌లోని అణు కేంద్రాలపై జరిపిన ఈ దాడుల కోసం వీటిని ఉపయోగించింది. ఇవి అత్యాధునిక గగనతల రక్షణ వ్యవస్థలను సైతం ఏమార్చి కచ్చితమైన దాడుల (ప్రెసిషన్ అటాక్స్)తో విరుచుకుపడగలవు. 40 వేల పౌండ్ల (18 వేల కిలోల) మందుగుండు సామగ్రిని మోసుకెళ్లగలిగే ఈ 'రాకాసి' యుద్ధ విమానాలు అత్యంత రక్షణ కలిగిన లక్ష్యాలను సైతం నాశనం చేయగలవు. స్టెల్త్ ఫీచర్లను కలిగి ఉండే ఈ బాంబర్లను గుర్తించడం, ట్రాక్ చేయడం, ప్రతిఘటించడం చాలా కష్టం. ప్రపంచంలో ఇప్పటివరకు ఉన్న సైనిక విమానాల్లో ఇదే అత్యంత ఖరీదైనది. ఒక్కో బీ-2 బాంబర్ ఖరీదు దాదాపు 210 కోట్ల డాలర్లు (రూ.18,182 కోట్లు). నార్త్‌రోప్ గ్రమ్మన్ కంపెనీ తయారు చేసిన ఈ భారీ, లాంగ్-రేంజ్ బాంబర్ మార్గం మధ్యలో ఇంధనాన్ని నింపుకోకుండా ఏకబిగిన దాదాపు 7 వేల మైళ్లు (11 వేల కిలోమీటర్లు), ఒకసారి రీఫ్యూయలింగ్‌తో 11,500 మైళ్లు (18,500 కిలోమీటర్లు) ప్రయాణించగలదు. ప్రపంచంలోని ఏ ప్రాంతానికైనా కేవలం గంటల వ్యవధిలోనే చేరుకోగలదు.

# తెలంగాణలో అప్పటిదాకా వానలే..

(మొదటి తరువాయి)

నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో వానలు పడుతాయని చెప్పింది.సోమవారం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్, భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో భారీ వర్షాలు పడుతాయని చెప్పింది. అలాగే, నిర్మల్, నిజామాబాద్, ఆదిలాబాద్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ ఈదురుగాలులతో కూడిన వానలు కొనసాగుతాయని చెప్పింది. మంగళవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు భూపాలపల్లిలో భారీ వర్షాలు పడే సూచనలున్నాయని చెప్పింది. అలాగే, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, వికారాబాద్, మేడ్చల్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వివరించింది.

## 2025 జూలై 6, ఆదివారం తెలుగు పంచాంగం




మాసం -పక్షం
మాసం: ఆషాఢమాసం (అమాంత)
పక్షం: శుక్లపక్షం
తిథి
ఏకాదశి: జూలై 5, తెల్లవారుజాము 12:06 నుండి జూలై 6, రాత్రి 10:25 వరకు
ద్వాదశి: జూలై 6, రాత్రి 10:25 నుండి జూలై 7, రాత్రి 8:45 వరకు
నక్షత్రం
విశాఖ: జూలై 5, ఉదయం 3:22 నుండి జూలై 6, ఉదయం 2:01 వరకు
అనూరాధ: జూలై 6, ఉదయం 2:01 నుండి జూలై 7, ఉదయం 12:37 వరకు
శుభ సమయాలు
బ్రహ్మ ముహూర్తం: ఉదయం 4:13- 5:01
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 11:56- 12:48
అశుభ సమయాలు
రాహుకాలం: సాయంత్రం 5:08 - 6:49
యమగండం: మధ్యాహ్నం 12:16 - 1:57
దుర్ముహూర్తం: సాయంత్రం 5:04 - 5:56
వర్జ్యం: మధ్యాహ్నం 3:47 - సాయంత్రం 5:24

# గుండాల ఏకలవ్య పాఠశాలలో అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

విద్యార్థుల హాజరు, హాస్టల్ పారిశుధ్యం పరిశీలించిన అమరేందర్



**వెల్దండ, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండల పరిధిలోని గుండాల గ్రామంలో ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో నాగర్‌కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ శ్రీ అమరేందర్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల రికార్డులు, ఉపాధ్యాయుల మరియు విద్యార్థుల హాజరు పట్టికలను సమీక్షించారు. బాలురు, బాలికల హాస్టళ్లలోని బాత్రూం, వాష్‌రూమ్‌లను పరిశీలించి పారిశుధ్య నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల నిర్వహణ పట్ల ప్రశంసలు పలికిన అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కోడం భాస్కర్‌ను అభినందించారు. ఈ తనిఖీలో ఉపాధ్యాయులు రినా, అనూష, కీర్తి, రాహుల్, పర్వీన్, హిమా దుద్దీన్, మల్లిక తదితరులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్‌లో భారీగా గంజాయి చాక్లెట్లతో పాటు పట్టివేత

-నందిగామ పారిశ్రామిక వాడలో హోటల్‌పై ఎక్సైజ్ పోలీసుల దాడి



**షాద్‌నగర్, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా నందిగామ పారిశ్రామిక వాడలో గల ఓ చిన్న హోటల్‌లో రెండు కిలోల గంజాయితో పాటు 9 కిలోల గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో షాద్‌నగర్ ఎక్సైజ్ సీఐ శేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పింటూ సింగ్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఎక్సైజ్ డిపిఓ ఉజ్వల మాట్లాడుతూ, "పాఠశాలలు, కళాశాలల్లో గంజాయి వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నాం" అని తెలిపారు.

# నాగర్‌కర్నూల్‌లో ఈవీఎం గోడౌన్ తనిఖీ చేసిన కలెక్టర్

భద్రతా ఏర్పాట్లపై సమీక్ష, అధికారులకు సూచనలు



**నాగర్‌కర్నూల్, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోడౌన్‌ను శనివారం జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తనిఖీ చేశారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ప్రతి నెలా ఈవీఎంల భద్రతను సమీక్షించాల్సిన నిబంధన ఉందని, ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు తనిఖీలు కచ్చితంగా అమలు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఈవీఎంల నిల్వ పరిస్థితులు, సీసీ కెమెరాల పనితీరు, సీల్స్ వివరాలు, అనధికార ప్రవేశ నిరోధక చర్యలు తదితర అంశాలను స్వయంగా పరిశీలించారు. భవిష్యత్‌లో భద్రతకు లోటు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ తనిఖీలో ఎన్నికల విభాగం సూపరిండెంట్ రవికుమార్, బాలకృష్ణ, ఎండి హుస్సేన్, రామకృష్ణతో పాటు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# విద్యతో కలెక్టర్ అయ్యాను

– వెనుకబడిన విద్యార్థులకు మార్గదర్శకత్వం అవసరం
-ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యకు కృషి చేయాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ పిలుపు



**నాగర్‌కర్నూల్, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
"ప్రభుత్వ పాఠశాలలో చదువుకోవడం వల్లే నేను ఈ స్థాయికి వచ్చాను. ఉపాధ్యాయుని ప్రోత్సాహమే నన్ను ఐఏఎస్‌గా తీర్చిదిద్దింది" అంటూ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ భావోద్వేగంగా పేర్కొన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని, విద్యతోనే విజయానికి మార్గం అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన విద్యా సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచే చర్యలు, వైద్య, ప్రయోజక పథకాల నాణ్యత పెంపు కోసం ఉపాధ్యాయులు, విద్యా అధికారులు కృషి చేయాలని సూచించారు. 'పదో తరగతి పూర్తి చేసిన ప్రతి విద్యార్థి ఇంటర్మీడియట్‌లో చేరేలా చర్యలు తీసుకోవాలి. గైర్హాజరైన విద్యార్థులపై కౌన్సెలింగ్ చేయాలి. బాలికలకు టాయిలెట్లు, మంచి భోజనం, ఫ్యాన్, లైట్లు వంటి సౌకర్యాలు కల్పించాలి" అని కలెక్టర్ ఆదేశించారు. చదువుకు దూరంగా ఉన్న విద్యార్థులకు బేసిక్‌లు, రాయడం, చదవడం, గణితంలో ప్రావీణ్యం కోసం వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పదవ తరగతి విద్యార్థులకు 100% ఉత్తీర్ణత లక్ష్యంగా విధానాలు రూపొందించాలన్నారు. ఈ సమావేశంలో డీఈఓ రమేష్ కుమార్, నోడల్ అధికారి కురుమయ్య, జిల్లా విద్యా సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

# సమాజ సేవలో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అంకితభావం అభినందనీయం

– సీనియర్ జడ్జి శ్రీమతి శ్రీదేవి







**కల్వకుర్తి, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీకేఆర్ ఫంక్షన్ హాల్ లో ప్రారంభమైన ఉచిత కంటి వైద్య శిబిరంకు ప్రజలు భారీగా హాజరయ్యారు. సీనియర్ జడ్జి శ్రీమతి శ్రీదేవి, ప్రముఖ డాక్టర్ దామోదర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని సేవలను పరిశీలించారు. "సమాజం పట్ల సేవా దృక్పథంతో పనిచేస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి గారి సేవలు ప్రశంసనీయం" అని జడ్జి శ్రీదేవి పేర్కొన్నారు. మొదటి రోజే 800 మందికి పైగా హాజరయ్యారు. 600 మందికి కంటి పరీక్షలు, 35 మందికి శుక్లాల సర్జరీ ఎంపిక, 300 మందికి ఉచిత అద్దాల పంపిణీ జరిగింది. "కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రతి పేదవాడికి అండగా ఉండటమే మా లక్ష్యం" అని సుంకిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పవన్ కుమార్ రెడ్డి, బీసీ బాలరాజు, పర్శపాకుల రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ, వైద్య బృందం సేవలపై అతిథులు ప్రశంసలు కురిపించారు.

# తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిసిన శంభీపూర్ క్రిష్ణ



**హైదరాబాద్, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ కార్యకలాపాలపై పలు అంశాలపై చర్చించినట్లు సమాచారం.

# రేకుర్తి దవాఖానాలో 30 మంది పేదవారికి ఉచిత శస్త్రచికిత్సలు



**కరీంనగర్, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రేకుర్తి కంటి దవాఖానాలో ఈరోజు 30 మంది పేదవారికి ఉచిత శస్త్రచికిత్సలు నిర్వహించి, చికిత్స అనంతరం వారిని వారి ఊర్లకు పంపించారు. ఈ సేవా కార్యక్రమాన్ని డాక్టర్ శ్రీ దేశముఖ్ గారు స్వయంగా నిర్వహించగా, వైస్ చైర్మన్ చిదురు సురేష్ సహా దవాఖానా సిబ్బంది పాల్గొన్నారు. ఆర్థికంగా వెనుకబడినవారికి మెరుగైన వైద్యం అందించాలన్న లక్ష్యంతో నిర్వహించిన ఈ శిబిరం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. రేకుర్తి దవాఖానా తరఫున ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

# పిర్ల పండుగ వేడుకలో మాజీ జడ్పీటిసి, మాజీ వైస్ ఎంపిపి

**కడ్తాల్, జూలై 5(నీలగిరి ఎక్స్ ప్రెస్)**



కడ్తాల్ మండలం మక్తమాధారం గ్రామంలో శనివారం రాత్రి పీర్ల పండుగ వేడుకల్లో కడ్తాల్ మండల మాజీ జడ్పీటిసి దశరథ్ నాయక్, మాజీ వైస్ ఎంపిపి ఆనంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీర్లను దర్శించుకొని కొద్దిసేపు ఆలావ్ ఆడారు. స్థానిక ముస్లిం సోదరులు వారిని శాలువాలతో సన్మానించారు. కులమతాలకు అతీతంగా పీర్ల పండుగను ప్రజలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి సులోచన సాయిలు, మాజీ ఎంపిటిసి మంజుల చంద్రమౌళి, మాజీ ఉప సర్పంచి గణేష్, మార్కెట్ మాజీ డైరక్టర్ లాయక్ అలీ, నాయకులు శ్రీనివాస్ గౌడ్, సత్యం గౌడ్, రిపోర్టర్ రామకృష్ణ, బిఆర్ ఎస్ నాయకులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో వ్యక్తికి తీవ్ర గాయాలు

**వెల్దండ, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండల కేంద్రంలోని హైదరాబాద్ జాతీయ రహదారిపై రాత్రి 8:30 గంటల సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న వెల్దండ ఎస్సై కురుమూర్తి, కానిస్టేబుళ్లు శీను, రాఘవేందర్, కృష్ణ సంఘటన స్థలానికి చేరుకుని బాధితుడిని రాంప్రసాద్ గా గుర్తించారు. వెంటనే అంబులెన్స్‌లో కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి కారణమైన వాహనం గుర్తించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.



# మార్నింగ్ వాక్‌లో ప్రజల సమస్యలపై స్పందించిన మాజీ డిప్యూటీ మేయర్

**లేక్ వ్యూ కాలనీలో ధనరాజ్ యాదవ్ పర్యటన, పరిష్కారానికి హామీ**



**నిజాంపేట్, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ 7వ డివిజన్ లేక్ వ్యూ కాలనీలో మార్నింగ్ వాక్ సందర్భంగా మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ కాలనీ వాసులతో కలిసి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చెత్త తొలగింపు, డ్రైనేజీ, విధి కుక్కల బెడద, రోడ్లపై అడ్డంగా పార్కింగ్ వంటి సమస్యలపై ప్రజలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "చెత్త తొలగింపునకు అవసరమైతే ప్రైవేట్ వాహనాలను కూడా నియమిస్తాం. విధి కుక్కల సమస్యపై బ్లుక్రాస్ సంస్థకు సమాచారం ఇస్తాం. ప్రజలు ఏ సమస్యను చెప్పినా నా వంతు సహకారం ఉంటుంది" అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లేక్ వ్యూ కాలనీ, ఎన్టీఆర్ నగర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

# జూలై 9 సార్వత్రిక సమ్మెకు డివైఎఫ్ఐ, ఐద్వా మద్దతు

**కార్మిక హక్కుల పరిరక్షణకు సంఘాల పిలుపు**



**కుత్బుల్లాపూర్, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జూలై 9న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు డివైఎఫ్ఐ (భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య), ఐద్వా (అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం) కుత్బుల్లాపూర్ మండల కమిటీలు మద్దతు ప్రకటించాయి. షాపూర్‌నగర్ కార్యాలయంలో సమ్మె పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు పసుల అంజయ్య, మండల అధ్యక్షులు ఆది నాగరాజు, ఐద్వా అధ్యక్షురాలు రావుల స్వాతి మాట్లాడుతూ, "కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తోంది. పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలి. కనీస వేతనం 26,000, 8 గంటల పని విధానం, అసంఘటిత రంగ కార్మికులకు పెన్షన్ వంటి హక్కులు అమలు చేయాలి" అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి ఎండి భాష, యువజన సంఘం నాయకులు సాయికుమార్, బీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# సమాజ శాంతికి విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు

**-అనుమతి లేకుండా సభలు, ర్యాలీలపై నిషేధం**
**- కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం**



**కరీంనగర్, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, ఐపీఎస్ స్పష్టం చేశారు. శాంతి భద్రతల పరిరక్షణకు సంబంధించి నియమ నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తున్నామని తెలిపారు. సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించాలంటే సంబంధిత ఏసీపీ నుంచి ముందుగా అనుమతి తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అనుమతి లేకుండా ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించరాదని, దరఖాస్తు ద్వారా అనుమతి పొందితేనే పోలీస్ శాఖ భద్రతా చర్యలు చేపడుతుందని వివరించారు. ఈ నెల 31 వరకు అమల్లో ఉండే ఉత్తర్వుల ప్రకారం, ఇతరులను గాయపరిచే వస్తువులు, మారణాయుధాలు ధరించి సంచరించరాదని, రోడ్లు లేదా ప్రజలకు ఉపయోగపడే స్థలాల్లో జన సమీకరణ నిషేధమని తెలిపారు. అనుమతి పొందని ప్రాంతాల్లో మ్యూజిక్, ప్రసంగాలు, రణగొణ ధ్వనులు చేయరాదని హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే హైదరాబాద్ నగర పోలీస్ చట్టం, 1348 ఫసలీ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ గౌష్ ఆలం స్పష్టం చేశారు.

# యువత రాజకీయాల్లోకి రావాలి

**- చట్టసభల్లో బలమైన చర్చలకు అవసరం**
**-అబ్దుల్ అలీమ్ జన్మదిన వేడుకల్లో తెల్గమల్ల జగన్ వ్యాఖ్యలు**



**కుత్బుల్లాపూర్, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు అబ్దుల్ అలీమ్ జన్మదిన వేడుకలు పట్టణ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తెల్గమల్ల జగన్, ఆదివాసి రాష్ట్ర నాయకుడు కృష్ణ నాయక్ మాట్లాడుతూ, "దేశ రాజకీయాల్లో పాతతరం అంతరించిపోయింది. చట్టసభల్లో బలమైన చర్చలు జరగాలంటే యువత రాజకీయాల్లోకి రావాలి" అని ఆకాంక్షించారు. అలీమ్‌కు కేక్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నేతలు, యువత రాజకీయాల్లోకి రావడం ద్వారా సమాజంలో మార్పు సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఈయూఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, సోషల్ మీడియా కన్వీనర్ దేవరశెట్టి మహేష్, శేఖర్ గౌడ్, గౌస్, శ్రీను, కుమార్ గౌడ్, సురేష్ నాయక్, అంజాత్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రాజు కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే



**పెద్దపల్లి, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఓదెల మండలం రూపునారాయణపేటకు చెందిన రాపర్తి రాజు యాదవ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు ఆయన నివాసానికి వెళ్లి నివాళులు అర్పించి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం కనగర్తి గ్రామంలో మృతి చెందిన తుడి ఆశాలు కుటుంబాన్ని కూడా పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని గ్రామస్థాయిలో ఘనంగా నిర్వహించాలి

**- నల్ల శ్రీకాంత్ జాంభవ్**



**దేవరకొండ, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జులై 7న ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని గ్రామస్థాయిలో ఘనంగా నిర్వహించాలని నియోజకవర్గ ఇన్‌చార్జ్ నల్ల శ్రీకాంత్ జాంభవ్ పిలుపునిచ్చారు. మాదిగ రిజర్వేషన్ల కోసం 30 ఏళ్లుగా పోరాటం చేస్తున్న ఎమ్మార్పీఎస్ ఉద్యమం దేశంలోనే అరుదైనదని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలిపిన కుల సంఘాల నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# జెట్ స్కీ తరలింపును అడ్డుకున్న బీఆర్ఎస్

**మానేరు నదిలోనే కొనసాగాలని పట్టుదల - చల్ల హరిశంకర్**



**కరీంనగర్, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
లోయర్ మానేరు డ్యామ్‌లో ఉన్న జెట్ స్కీ స్కూటర్‌ను హైదరాబాద్‌కు తరలిస్తున్న విషయాన్ని తెలుసుకున్న బీఆర్ఎస్ నగర శాఖ నాయకులు చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో లేక్ పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ప్రజల డబ్బుతో కొనుగోలు చేసిన స్కూటర్‌ను స్థానిక పర్యాటక అభివృద్ధికి వినియోగించాలంటూ నినాదాలు చేశారు. ధర్నా అనంతరం పర్యాటక శాఖ అధికారులు జెట్ స్కీని మానేరు నదిలోనే తిరిగి స్థాపించారు. ఈ సందర్భంగా హరిశంకర్ మాట్లాడుతూ, "గంగుల కమలాకర్ నేతృత్వంలో మానేరు నది పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేస్తోంది" అని విమర్శించారు. పొన్నం అనిల్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, "కేసీఆర్ కాళేశ్వరం ద్వారా రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేశారు. గంగుల కమలాకర్ అభివృద్ధిని తుడిచేయాలన్న కుట్రను ప్రజలు సహించరు" అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మాట ఇచ్చాడు- మాట నిలబెట్టుకున్నాడు

**షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా 5 కోట్ల రూపాయల రోడ్డు పనులకు శంకుస్థాపన**



**షాద్‌నగర్, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పరిగి రోడ్డు నుండి సీఎస్కే కాలనీ వరకు 5 కోట్లతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శంకుస్థాపన చేశారు. గత నెలలో సీఎస్కే వెల్ఫేర్ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను కలవగా, అభివృద్ధి పనులకు హామీ ఇచ్చిన ఆయన, ఇప్పుడు మాట నిలబెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "ఇంతకుముందు లాభాపేక్షతో నాసిరకం పనులు జరిగాయి. ఇప్పుడు మాస్టర్ ప్లాన్, లెవెల్ ఎస్టిమేట్, ఇంజనీర్ల పర్యవేక్షణతో నాణ్యమైన పనులు జరుగుతాయి" అని తెలిపారు. పార్కుల అభివృద్ధి, 15 పార్కుల సుందరీకరణకు కూడా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కొంకల్ల చెన్నయ్య, సయ్యద్ ఇబ్రహీం, సీఎస్కే వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, కాలనీ మహిళలు, విల్లాల ఓనర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా రాచమల్ల ప్రవీణ్ గుప్త



నియామక పత్రం అందుకుంటున్న ప్రవీణ్ గుప్త

**ఇబ్రహీంపట్నం, జూలై 5(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మంచాల మండలం ఆర్యవైశ్య మహాసభ సంఘం అధ్యక్షుడిగా రాచమల్ల ప్రవీణ్ గుప్త ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు .మంచాల మండల కేంద్రంలో అధ్యక్షులు చీకటిమల్ల. హనుమంతు అధ్యక్షతన నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. ఆర్యవైశ్య మహాసభ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు తాడేపల్లి వెంకటేశం గుప్తా ఎన్నికల అధికారి హాజరై ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షులుగా రాచమల్ల ప్రవీణ్ గుప్త ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది అని తెలిపారు. ప్రవీణ్ గుప్త మాట్లాడుతూ.. మండల అధ్యక్షుడిగా తనను ఏకగ్రీవంగా ఎన్నుకోవడంపై ప్రవీణ్ గుప్త కృతజ్ఞతలు తెలిపారు . ఆర్యవైశ్య మహాసభ సంఘం అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తామన్నారు. ముఖ్య అతిథులుగా రంగారెడ్డి జిల్లా కోశాధికారి వనపర్తి బద్రీనాథ్ గుప్త పాల్గొన్నారు .ఈ కార్యక్రమంలో మంచాల మండలం ప్రధాన కార్యదర్శి బిలకంటి బాలాజీ గుప్త మరియు మాజీ అధ్యక్షులు చంద్రమౌళి గుప్త ,విడియాల వెంకన్న గుప్త, సాతెల్లి. శ్రీను గుప్త, కండె మల్లేష్ గుప్త , మరియు మండల ఆర్యవైశ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నిరుపేదల వైద్యానికి సీఎంఆర్ఎఫ్ తోడ్పాటు

**-117 మందికి చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే కవ్వంపల్లి**



**మానకొండూర్, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఇల్లంతకుంట మండల పరిషత్ కార్యాలయంలో 84 మంది సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు ?25.53 లక్షలు, 33 మంది కళ్యాణలక్ష్మి లబ్ధిదారులకు 33 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ అందజేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రభుత్వమే ఆర్థికంగా చేదోడు వాదోడుగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందే నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ ఊతమిస్తుందని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఎలగందుల ప్రసాద్, వెలిశాల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# టీవీ9 రిపోర్టర్ ప్రసాద్‌కు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డ బోయిన గోపి నివాళి



**సిరిసిల్ల, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
టీవీ9 రిపోర్టర్ ప్రసాద్ నేడు పరమపదించగా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డ బోయిన గోపి ఆయన పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రసాద్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# ఉమ్మడి కరీంనగర్ వైభవ గీతం పోస్టర్ ఆవిష్కరణ

కేంద్రమంత్రి బండి సంజయ్ చేతుల మీదుగా ఆవిష్కరణ




**కరీంనగర్, జూలై 5(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గుండేటి రమేష్ రచన, గానం, దర్శకత్వంలో రూపొందనున్న "ఉమ్మడి కరీంనగర్ జిల్లా వైభవ గీతం" పోస్టర్‌ను కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ శనివారం ఆవిష్కరించారు. ఈనెల 19న షూటింగ్ ప్రారంభమవుతుందని, ఆగస్టు 2న గుండేటి మ్యూజిక్, మూవీస్ ద్వారా ఆల్బమ్ విడుదల కానుందని దర్శకుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు సొల్లు అజయ్ వర్మ, మాజీ కార్పొరేటర్ బండరమణ రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ అభివృద్ధికి 20 వేల కోట్ల నిధులు

-బండి సంజయ్
-వీణవంక, గంద్రపల్లిలో సీసీ రోడ్లకు శంకుస్థాపన




**హుజురాబాద్, జూలై 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ పార్లమెంట్ అభివృద్ధికి గత ఆరు సంవత్సరాల్లో 20 వేల కోట్లకుపైగా నిధులు తీసుకొచ్చినట్లు కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. వీణవంక, గంద్రపల్లిలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లకు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. అభివృద్ధి కోసం పార్టీలకతీతంగా స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి పనిచేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# టీవీ9 జర్నలిస్టు ప్రసాద్ మృతి పట్ల కేంద్ర మంత్రి బండి సంజయ్ సంతాపం



**కరీంనగర్, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సిరిసిల్ల టీవీ9 రిపోర్టర్ ప్రసాద్ ఆకాల మరణం పట్ల కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "చురుకైన జర్నలిస్టుగా పనిచేసిన ప్రసాద్ చిన్న వయసులోనే మృతి చెందడం బాధాకరం" అని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ, కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. "నిరంతరం వార్తల కోసం శ్రమించే జర్నలిస్టులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి" అని మంత్రి సూచించారు.

# శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో పాలక మండలి అభినందన సభ




**వర్గల్, జూలై 5(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
గజ్వేల్ నియోజకవర్గం వర్గల్ మండలంలోని నాచారం గ్రామంలో ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ శ్రీ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానము - నాచారం గుట్ట వద్ద నూతన పాలక మండలి సభ్యులకు ఘన అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తూప్రాన్ నుండి నాచారం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆలయంలో సభ నిర్వహించారు. ఆలయ చైర్మన్ గా పల్లెర్ల రవీందర్ గుప్తా మరియు కమిటీ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. దేవస్థానం అభివృద్ధి, భక్తుల సౌకర్యాలను మెరుగుపరచడంలో పాలక మండలి సభ్యులు నిబద్ధతతో పనిచేయాలి. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా ఆలయ పరిపాలనను ముందుకు తీసుకెళ్లాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సారెడ్డి, మాజీ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎలక్షన్ రెడ్డి, నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి, యూత్ కాంగ్రెస్ స్టేట్ వైస్ ప్రసిడెంట్ ఆంక్ష రెడ్డి, వంటిమామిడి ఏ.ఎం.సి వైస్ చైర్మన్ కోడిత్యాల ప్రభాకర్ గుప్తా, స్థానిక కాంగ్రెస్ నాయకులు మరియు భక్తులు పాల్గొన్నారు.

# రేపు యాచారం ఆర్యవైశ్య సంఘం సర్వసభ్య సమావేశం



**యాచారం,జూలై 05(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
యాచారం మండల ఆర్యవైశ్య సంఘం సర్వసభ్య సమావేశం సోమవారము 07 తేది ఉదయం 10 గంటలకు చౌదర్పల్లి గేటు దగ్గర రాధాకృష్ణ ఫంక్షన్ హాల్ లో నిర్వహిస్తున్నట్లు యాచారం మండల అధ్యక్షులు వీరబొమ్మల శ్రీనివాస్ గుప్త ఒక ప్రకటన లో తెలిపారు. కావున ఆర్యవైశ్య మహాసభ సంఘం సభ్యులు సమయానికి విచ్చేసి నూతన అధ్యక్ష ఎన్నిక గురించి చర్చించి సూచనలు సలహాలు ఇవ్వాల్సిందిగా కోరారు

# మంథని జడ్పిహెచ్‌ఎస్‌ను డిజిటల్ పాఠశాలగా తీర్చిదిద్దాలి

ఏఐ టూల్స్, స్పోకెన్ ఇంగ్లీష్‌పై విద్యార్థులకు శిక్షణ – మంత్రి శ్రీధర్ బాబు







**మంథని, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఆధునిక సాంకేతికతపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు తెలిపారు. శనివారం మంథని పట్టణంలో పలు అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షతో కలిసి శంకుస్థాపన చేశారు. జడ్పిహెచ్‌ఎస్ బాలికల పాఠశాలలో ?58 లక్షలతో నిర్మించిన డిజిటల్ క్లాస్‌రూమ్, లైబ్రరీ ప్రారంభించిన మంత్రి, "ప్రైవేట్ పాఠశాలల కంటే మెరుగైన సాంకేతిక వసతులు ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులోకి వస్తున్నాయి" అని పేర్కొన్నారు. ఏఐ టూల్స్, స్పోకెన్ ఇంగ్లీష్పై విద్యార్థులకు శిక్షణ, ఉపాధ్యాయులకు బోధనపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సింథటిక్ టెన్నిస్ కోర్టు, చిల్డ్రన్ పార్క్, చెరువుల బ్యూటిఫికేషన్, సబ్‌స్టేషన్ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. "మంథని జడ్పిహెచ్‌ఎస్‌ను పూర్తి స్థాయిలో డిజిటల్ పాఠశాలగా తీర్చిదిద్దుతాం" అని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ నన్నయ గౌడ్, ఆర్‌డీఓ సురేష్, తహసిల్దార్, ఎంపీడీఓ తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు సెల్ ఫోన్లు అందజేసిన సిఐ గంగాధర్



**కడ్తాల్, జూలై 5(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
పోగొట్టుకున్న సెల్ ఫోనులు బాధితులకు అందజేసారు హైదరాబాద్ కు చెందిన నాగేందర్.. ( మైసిగండిలో సెల్ పోయింది... కడప లో దొరికింది ) కడ్తాల్ కు చెందిన ఆదిత్య కడ్తాల్ లో పోయింది... కడ్తాల లో దొరికింది ) పోయిన ఫోన్ లు ఈరోజు స్టేషన్ లో సిఐ గంగాధర్ చేతుల మీదగా బాధితులు ఆదిత్య, నాగేందర్ కు అందించారు, ఈ కార్యక్రమంలో ఎస్సైలు వరప్రసాద్, చంద్రశేఖర్ ,ఎఎస్సై బాల్ రెడ్డి, క్రైమ్ కానిస్టేబుల్ రామకోటి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ సమితి
చెట్టు = అమ్మ
Reg No. 643/2025
Nurture Nature, Promote Wellness

చెట్టు = అమ్మ
చెత్త = రోగం

చెట్టు మన జీవితానికి అమ్మంత ప్రాముఖ్యమైనది. అది మనకు ప్రాణవాయువును అందిస్తుంది, ప్రకృతిని సంరక్షిస్తుంది, మన శ్రేయస్సుకు తోడ్పడుతుంది. చెట్టు ఉంటే జీవితం ఉందని చెప్పడం అసత్యం కాదు. మరోవైపు, చెత్త అనేది రోగాలకు కారణమవుతుంది. చెత్త ఎక్కడైతే పేరుకుపోతుందో అక్కడ పర్యావరణం కలుషితమవుతుంది, నీరు, గాలి, నేల నాశనం అవుతాయి.

చెట్టు ఎలా అమ్మలా ఉంటుంది:
-మనకు ఆక్సిజన్ అందిస్తుంది.
-నీడ, చల్లదనం, ఆహారం, చెక్క, ఔషధాలు అందిస్తుంది.
-ప్రకృతి మనుగడలో కీలక పాత్ర పోషిస్తుంది.

చెత్త ఎలా రోగంగా మారుతుంది:
-చెత్త పేరుకుపోతే దోమలు, చీమలు, బ్యాక్టీరియా పుట్టుక.
-కాలుష్యం వల్ల శ్వాసకోశ, నీరు మరియు ఆహారానికి సంబంధించిన రోగాలు.

చెట్టు మన జీవితానికి అమ్మవంటిది. అందుకే మనం చెట్లను నాటాలి, వాటిని కాపాడాలి.
చెత్త మన జీవనానికి రోగం. అందుకే చెత్తను తగ్గించాలి, పునర్వినియోగం చేయాలి, పర్యావరణాన్ని స్వచ్ఛంగా ఉంచాలి.
"ప్రకృతిని ప్రేమిద్దాం, జీవనాన్ని కాపాడుకుందాం!"
మీ నరేష్ దండు సామాజిక కార్యకర్త

# నెహ్రూ యువ కేంద్రం ద్వారా యువజన సంఘాలకు ఆర్థిక సహాయం

-జూలై 21లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువతకు పిలుపు

**కరీంనగర్, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మేరా యువభారత్ (మై భారత్) కార్యక్రమం కింద 2025 -26 ఆర్థిక సంవత్సరానికి నెహ్రూ యువ కేంద్రం ద్వారా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వివిధ కార్యక్రమాలకు ఆర్థిక సహాయం అందించనున్నారు. మొక్కలు నాటే కార్యక్రమాలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, స్వచ్ఛ భారత్, జాతీయ సమైక్యత శిబిరాలు వంటి కార్యక్రమాల నిర్వహణకు 15- 29 ఏళ్ల వయస్సు కలిగిన సభ్యులతో ఉన్న యువజన సంఘాలు తమ రిజిస్ట్రేషన్ కాపీతో నెహ్రూ యువ కేంద్రంలో జూలై 21లోపు దరఖాస్తు చేయాలని డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ ఎం. వెంకట రాంబాబు తెలిపారు. దరఖాస్తులు నెహ్రూ యువ కేంద్ర కార్యాలయం, బస్ స్టేషన్ ఎదురుగా, మెయిన్ రోడ్, కరీంనగర్ వద్ద స్వీకరించబడతాయి.

# బీసీ మహనీయుల పట్ల వివక్ష తగదు

- గుంజపడుగు హరిప్రసాద్
-దొడ్డి కొమరయ్య వర్ధంతి సందర్భంగా జిల్లా అధికారుల తీరుపై తీవ్ర విమర్శ



**కరీంనగర్, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
బీసీ కుల సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ కరీంనగర్ జిల్లా అధికారులపై తీవ్రంగా మండిపడ్డారు. తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమరయ్య వర్ధంతి సందర్భంగా బీసీ మహనీయుల పట్ల వివక్ష చూపడం తగదని పేర్కొన్నారు. "అగ్రవర్ణ నాయకులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చి, బీసీ యోధులను చిన్నచూపు చూడడం బాధాకరం. కూర్చోవడానికి కుర్చీలు లేకుండా, చిన్న చిత్రపటంతో పూలు వేయించడం అవమానకరం" అని హరిప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు గతంలో కూడా జరిగాయని గుర్తుచేస్తూ, "ఇకపై బీసీ సమాజం మౌనంగా ఉండదు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోకపోతే, జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు పెద్దఎత్తున ఆందోళన చేపడతాం" అని హెచ్చరించారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

-మంత్రి శ్రీధర్ బాబు
-మంథని ప్రెస్ క్లబ్ సందర్శనలో పత్రికా ప్రతినిధులకు హామీ



**మంథని, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రాష్ట్రంలో జర్నలిస్టుల సంక్షేమానికి సమగ్ర చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు తెలిపారు. శనివారం మంథని ప్రెస్ క్లబ్ను సందర్శించిన ఆయన, "ప్రతిపక్షంలో ఉన్నప్పుడైనా, అధికారంలో ఉన్నప్పుడైనా ప్రజల శ్రేయస్సే నా లక్ష్యం" అని పేర్కొన్నారు. మీడియా ప్రతినిధులు నాలుగో స్థంభంగా బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించిన మంత్రి, ఇందిరమ్మ ఇండ్లు, సిఎస్ఆర్ నిధులు వంటి పథకాలలో జర్నలిస్టులకు ప్రాధాన్యత కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ నన్నయ గౌడ్, అధికారులు, ప్రజా ప్రతినిధులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# సమరభేరి సభతో కాంగ్రెస్ నేతల్లో ఫుల్ జోష్

-సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికిఅందించాలి
-దేశానికే ఆదర్శం రైతు భరోసా
-కార్యకర్తలు స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలి
-ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి.



**వనపర్తి,జులై 05( నీలగిరి ఎక్స్ ప్రెస్):** సామాజిక న్యాయ సమరభేరి సభతో కాంగ్రెస్ కార్యకర్తలు నేతల్లో ఫుల్ జోష్ నింపిందని, హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సామాజిక న్యాయ సమరభరి సభతో కాంగ్రెస్ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి శనివారం ఒక ప్రకటన పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ప్రస్తుతం తెలంగాణలో 119 ఎమ్మెల్యే స్థానాలు ఉన్నాయని అవి నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 153 కాబోతున్నాయని కాంగ్రెస్ పార్టీకి కష్టపడి పనిచేసే కార్యకర్తలకు రాబోయే కాలంలో మంచి రోజులు ఉంటాయని నామినేటెడ్ పదవుల బర్తీ వెంటనే చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఇప్పటికే రాష్ట్ర అధినాయకత్వానికి సూచించడం జరిగిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టను పెంచే విధంగా పనిచేసిన కార్యకర్తలకు నామినేటెడ్ పదవులకు ఎంపిక చేయనుందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఖాతాలో కేవలం 9 రోజుల్లో 9000 కోట్ల రూపాయలను రైతు భరోసా పథకం ద్వారా అన్నదాతల ఖాతాలో జమ చేసిందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ గొప్ప విజయాన్ని రైతులకు ప్రజలకు కార్యకర్తలు వివరించాలని సూచించారు.అలాగే ఇందిరమ్మ ఇండ్లు. ఉచిత విద్యుత్తు. ఆర్టీసీ బస్సు ప్రయాణం. ఆరోగ్య శ్రీ పెంపు. నూతన రేషన్ కార్డుల మంజూరు. పాత రేషన్ కార్డులలో సభ్యుల చేరికలు. వంటి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రజలకు అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని ఎమ్మెల్యే మేఘా రెడ్డి తెలిపారు.. కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ ముఖ్యమంత్రి సహాయనిధి పథకాలు పేదలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని సీఎం సహాయ నిధి వల్ల పేదలకు కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామన్నారు. సన్న వడ్లు పండించిన రైతులకు రూ : 500 బోనస్ వల్ల ఎంతో మేలు జరుగుతుందన్నారు. వరి ధాన్యం సేకరించిన వెంటనే రైతుల ఖాతాలో నగదు జమ చేయడం జరిగిందని ఎమ్మెల్యే గుర్తు చేశారు. కార్యకర్తలతో కలిసి సామాజిక న్యాయ సభకు వెళ్లడం ఎంతో సంతోషాన్నిచ్చిందని కార్యకర్తలకు ఎలాంటి కష్టం వచ్చినా తాను ముందుండి పనిచేస్తానని నియోజకవర్గ ప్రజలకు ఇంటి పెద్ద కొడుకుగా.. అన్నగా.. తమ్ముడిగా.. పనిచేసే పెడతానని ఆయన అన్నారు..

## స్వచ్ఛ సర్వేక్షణ్-2025లో భాగంగా ఎలాబోతారం లో పారిశుధ్య సర్వే



**కరీంనగర్, జులై 5(నీలగిరి ఎక్స్ ప్రెస్)** ఎలా బోతారం గ్రామాలు పూర్తిగా శుభ్రంగా ఉండాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ సర్వేక్షణ్-2025 లో భాగంగా ఈరోజు ఎలాబోతారం గ్రామాన్ని పరిశీలనకు ఓ ప్రత్యేక బృందం సందర్శించింది. ఆకాడమీ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ సంస్థ తరఫున వచ్చిన ప్రతినిధులు గ్రామంలో చెత్త సేకరణ, వ్యర్థాల నిర్వహణ, పారిశుధ్య సిబ్బంది పనితీరు, ప్లాస్టిక్ వినియోగం, శుద్ధత తాగునీటి సరఫరా, పచ్చదనం, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, బహిరంగ ప్రదేశాల్లో పరిశుభ్రత వంటి అంశాలపై సమగ్రంగా పరిశీలించారు.ఇందులో భాగంగా గ్రామంలోని 16 గృహాలను సందర్శించి ప్రజల అభిప్రాయాలు సేకరించారు. ఈ అంశాలపై ఆధారపడి మార్కుల కేటాయింపుతో సర్వేను చేపట్టారు. అంతకుముందు, సూపర్‌వైజర్లు సురేష్, మధుకర్, రీసెర్చ్ ఇన్వెస్టిగేటర్లు రాణి, రజిత, అనూష, శీరీష లు కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతిని కలిశారు. జిల్లాలో పారిశుధ్య నిర్వహణపై తీసుకుంటున్న చర్యల గురించి ఆమె వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్, జగదీశ్వర్, రమేష్, వేణు, మండల పంచాయతి అధికారి జగన్ మోహన్ రెడ్డి, పంచాయతి కార్యదర్శి కిరణ్ కుమార్, మహేందర్ రావు, వెంకటేశ్వర్, రామ్, కిషోర్, ఫారుక్,, అంగన్వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు, జీపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శివ మారుతి గీతా అయ్యప్ప మందిర రాజగోపురానికి భారీ విరాళం

-మద్దెల జ్యోతి, కుమారస్వామి దంపతుల నుండి 5 లక్షల రూపాయల విరాళం



**షాద్‌నగర్, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్** లక్ష్మీనరసింహ కాలనీలోని శివ మారుతి గీతా అయ్యప్ప మందిర రాజగోపుర నిర్మాణానికి పట్టణానికి చెందిన మద్దెల జ్యోతి, కుమారస్వామి దంపతులు 5 లక్షల 4 రూపాయల విరాళాన్ని అందించారు. అలాగే నంద్యాల అనిత, పుల్లారెడ్డి దంపతులు 11,116 విరాళం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ తరఫున దాతలకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు. రాజగోపుర నిర్మాణానికి సహకరించదలచిన వారు ఆలయ కమిటీ అధ్యక్షుడు లష్కర్ ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి రెటికల్ నందీశ్వర్, కోశాధికారి దాస కృష్ణయ్య ను సంప్రదించాలని కమిటీ సభ్యులు కోరుతున్నారు.

## నేడు పెద్దపల్లి జిల్లాలో మంత్రి డా. వివేక్ వెంకటస్వామి పర్యటన



**పెద్దపల్లి, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి శనివారం పెద్దపల్లి జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఉదయం 10 గంటలకు కోటపల్లి పౌరసరఫరా గోదాంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేస్తారు. అనంతరం 11 గంటలకు కోటపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఆర్ఓఆర్ వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపాలిటీ లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేస్తారు. 12.30 గంటలకు చెన్నూర్ బస్టాండ్‌లో మంత్రి సహకారంతో 5 నూతన బస్సులను ప్రారంభిస్తారు. సాయంత్రం 4 గంటలకు గోదావరిఖని ఆర్కే గార్డెన్‌లో సన్మాన సభలో పాల్గొంటారు.

## జగన్నాథ రథయాత్రలో పాల్గొన్న కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జగన్నాథ రథయాత్ర కమిటీ ఆధ్వర్యంలో కరీంనగర్ నగరంలో ఘనంగా నిర్వహించిన జగన్నాథ రథయాత్రలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పాల్గొన్నారు. జగన్నాథ స్వామి దర్శనం చేసిన అనంతరం, స్వామి వారి రథం వెళ్లే మార్గాన్ని బంగారు చీపురుతో శుభ్రం చేసి, భక్తులతో కలిసి రథాన్ని లాగారు. ఈ రథయాత్ర రాంనగర్ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయం నుండి ప్రారంభమై మంకమ్మ తోట, గీతా భవన్ బస్టాండ, కమాన్, శాస్త్రి రోడ్, టవర్ సర్కిల్ మీదుగా సాగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో రథాన్ని లాగారు. ఈ సందర్భంగా నగరంలో భజనలు, కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.


## ఈవీఎం గోదామును తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ శ్రీ ఆదర్శ్ సురభి.



**వనపర్తి జూలై 5 ( నీలగిరి ఎక్స్ ప్రెస్):** జిల్లా కేంద్రంలోని ఈవీఎంలు భద్రపరిచిన గోదాము కట్టుదిట్టమైన భద్రత నడుమ ఉందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు.
శనివారం ఆర్డీవో కార్యాలయం వెనక ఉన్న ఈవీఎం, వీవీప్యాట్ గోదాము ను నెలవారీ తనిఖీల్లో భాగంగా జిల్లా కలెక్టర్ ఆర్డీవో సుబ్రహ్మణ్యంతో కలిసి పరిశీలించారు. ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా గోదాం వద్ద భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేశారు. సీసీ కెమెరాల భద్రతా వ్యవస్థను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు ఈవీఎం, వీవీ ప్యాట్ గోదామును తనిఖీ చేసి సమగ్ర నివేదికను సమర్పిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో శనివారం నెలవారి తనిఖీ లు చేసినట్లు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులకు వివరించారు. తహసిల్దార్ రమేష్ రెడ్డి, ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## హన్మకొండలో బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లో భారీ చేరికలు

-కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**హన్మకొండ, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 30వ డివిజన్ అధ్యక్షుడు వల్లెపు రమేష్, నాయకుడు బొంత సారంగం ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరిని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి బాలసంద్రం లోని తన క్యాంపు కార్యాలయంలో కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలన నచ్చి ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరుతున్న ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తానని, ఎవరికి ఎలాంటి సమస్య వచ్చిన తనవద్దకు రావాలని, ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. "కాంగ్రెస్ పార్టీని నమ్మిన ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుంది" అని ఎమ్మెల్యే నాయిని స్పష్టం చేశారు. అంతకు ముందు, రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వ విధానాలు నచ్చి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నామని బిఆర్ఎస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బొంత సారంగం, వల్లెపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## చిగురుమామిడి ఎస్సైగా సాయికృష్ణ బాధ్యతల స్వీకరణ

**హుస్నాబాద్, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుస్నాబాద్ నియోజకవర్గంలోని చిగురుమామిడి మండల నూతన ఎస్సైగా సాయికృష్ణ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ గతంలో ఎస్సైగా విధులు నిర్వహించిన సందబోయిన శ్రీనివాస్ కరీంనగర్ ఎస్బీకి బదిలీ అయ్యారు. శ్రీనివాస్ ఎస్సైగా పనిచేసిన కాలంలోనే మండల ప్రజల్లో విశ్వాసం సంపాదించి, మంచి గుర్తింపు పొందారు. ఆయన స్థానంలో బాధ్యతలు చేపట్టిన సాయికృష్ణ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పర్యవేక్షణకు ప్రజలు, ప్రజాప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని కోరారు.



# మంత్రి పొంగులేటి, రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేష్ కుమార్ తో రెవెన్యూ జేఏసీ సమావేశం...

-జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ ఉద్యోగుల సమస్యలపై మంత్రికి విన్నపం...
-సానుకూలంగా స్పందించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
-కృతజ్ఞతలు తెలిపిన రెవెన్యూ జేఏసీ నేతలు



**హైదరాబాద్, జులై 05(నీలగిరి ఎక్స్ ప్రెస్):** కొత్తగా రానున్న గ్రామ పాలన అధికారుల (జీపీవోల) కోసం ప్రతి రెవెన్యూ గ్రామంలో కార్యాలయ స్థలాన్ని కేటాయించాలని విన్నవించారు. జూనియర్ అసిస్టెంట్ల నుండి నాయబ్ తహసీల్దార్ వరకు అన్ని స్థాయిల రెవెన్యూ ఉద్యోగుల విధులను పునఃసమీక్షించి, జాబ్ చార్ట్ రూపొందించి ఇవ్వాలని, జిల్లాలు, జోన్లలో జూనియర్ అసిస్టెంట్ల నుంచి నాయబ్ తహసీల్దార్ వరకు ఉద్యోగుల పరస్పర అంగీకార బదిలీల అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ శాఖ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులటి శ్రీనివాస రెడ్డికి తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్ వి లచ్చిరెడ్డి విన్నవించారు.

రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్ నుంచి నాయబ్ తహసీల్దార్ వరకు ఉన్న రెవెన్యూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు %-% పరిష్కరించాల్సిన అంశాలపై అభ్యర్థనకు సంబంధించి శనివారం తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్,

తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (టీజీఆర్ఎస్ఏ) గౌరవ అధ్యక్షులు వి.లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ జేఏసీ నాయకులు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను రెవెన్యూ జేఏసీ బాధ్యులుగా మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా... , 2015 నుంచి మాజీ వీఆర్ఏల వారసుల కారుణ్య నియామకాలు నిలిచిపోయాయి. అర్హత కలిగిన అభ్యర్థులకు వీలైనంత త్వరగా కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు.

రెవెన్యూ ఉద్యోగులకు శిక్షణ ఇచ్చేందుకు ప్రతి జిల్లా కేంద్రంలో రెవెన్యూ అకాడమీలు ఏర్పాటుచేయాలనీ, అన్ని స్థాయిల రెవెన్యూ ఉద్యోగుల్లో ఉత్సాహాన్ని పునరుద్ధరించేందుకు క్రీడలు మరియు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. రెవెన్యూ ఉద్యోగాల ఖాళీలకు అనుగుణంగా, అర్హత కలిగిన జూనియర్ అసిస్టెంట్ నుంచి నాయబ్ తహసీల్దార్ క్యాడర్ వరకు పనిచేస్తున్న ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని మంత్రిని కోరారు. ప్రస్తుత జనాభా, అవసరాలు మరియు రెవెన్యూ శాఖకు అప్పగించిన విధుల ఆధారంగా సీసీఎల్ఏ కార్యాలయం, కలెక్టరేట్‌లు, డివిజన్ కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయాల స్టాఫ్ ప్యాటెర్న్‌ను పునః సమీక్షించాలని కోరారు. సర్టిఫికెట్ల జారీ మరియు భూ వివాదాల కారణంగా పని భారం తీవ్రంగా పెరిగినందున ప్రతి మండలానికి 3 స్పెషల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పోస్టులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. పోలీసు సిబ్బందికి ఇస్తున్నట్టుగానే రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు ద్విచక్ర వాహనాలు మరియు ఇంధన చార్జీలు ఇవ్వాలని మంత్రికి సూచించారు. విద్యుత్ చార్జీలు, ఇంటర్నెట్ ఖర్చులు, స్టేషనరీ ఖర్చులు పెరిగినందున ఆఫీస్ నిర్వహణ ఖర్చులను పెంచాలని అన్నారు. ప్రజాప్రతినిధులు మరియు వీఐపీల పర్యటనలు ఎక్కువవుతున్న నేపథ్యంలో తహసీల్దార్ కార్యాలయాలకు ప్రోటోకాల్ మరియు కంటింజెన్సీ ఖర్చులను మంజూరు చేయాలని కోరారు. తహసీల్దార్ కార్యాలయాల్లో మహిళా ఉద్యోగులు మరియు సందర్శకుల కోసం ప్రత్యేక వాష్‌రూంలు ఏర్పాటు చేయాలనీ, అవసరమైన అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో తగు మౌలిక సదుపాయాలను కల్పించాలి. అవసరమైన చోట్ల కొత్త భవనాలు నిర్మించాలనీ,

భూభారతి చట్టం-2025ను సమర్థవంతంగా అమలు చేయడానికి గ్రామ పాలన అధికారుల నియామక ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలనీ, రెవెన్యూ మరియు ఇతర చట్టాలలో వస్తున్న మార్పులను ఉద్యోగులు సులభంగా అర్థం చేసుకొని, సమర్థంగా విధులు నిర్వహించేందుకు వారందరికీ క్రమం తప్పకుండా ఓరియంటేషన్ శిక్షణలు అందించాలని కోరారు. ఈ విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకొని, పరిపాలనా వ్యవస్థ సాఫీగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ డిఎస్ లోకేష్ కుమార్ కు జైస్ చైర్మన్ వి లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు అండగా ఉంటుందని ఉద్యోగులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య పేగు బంధం ఉందని మంత్రి తెలిపారు. ఉద్యోగులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు కృషి చేస్తున్నామని అని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ డిఎస్ లోకేష్ కుమార్ కు ఉద్యోగ చైర్మన్ వి లచ్చిరెడ్డి ఆధ్వర్యంలోని రెవెన్యూ జేఏసీ బాధ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ తహసీల్దార్ అసోసియేషన్ రాష్ట్ర మహిళా వింగ్ ప్రెసిడెంట్ రాధ, తెలంగాణ తాసిల్దార్స్ అసోసియేషన్ అద్యక్ష, కార్యదర్శులు ఎస్ రాములు, రమేష్ పాక, పూల్ సింగ్ చౌహన్, టిజిఆర్ ఎస్ ఏ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సుజాతాచౌహాన్, టిజిఆర్ ఎస్ ఏ, సిసిఎల్ఏ యూనిట్ ప్రెసిడెంట్ రాంబాబు, సెక్రటరీ కృష్ణ చైతన్య, తెలంగాణ రెవిన్యూ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షులు బాణాల రామ్ రెడ్డి ప్రధాన కార్యదర్శి వి.బిక్షం, తెలంగాణ తహసిల్దార్స్ అసోసియేషన్ అసోసియేట్ ప్రెసిడెంట్ చిల్లా శ్రీనివాస్, గ్రామ పాలన అధికారుల సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గరికె ఉపేంద్రరావు, వి లక్ష్మీ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ యువనేత కాల్వ రాజు మృతి

– మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శ



**హుస్నాబాద్, జూలై 5(నీలగిరి ఎక్స్ ప్రెస్):** బస్వాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువనేత కాల్వ రాజు ఇటీవల గుండె పోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. ఈ విషాద సమయంలో ఆయన కుటుంబాన్ని పరామర్శించేందుకు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయంగా వారి నివాసానికి వెళ్లారు. మంత్రి గారితో పాటు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, గ్రామ శాఖ అధ్యక్షులు, ప్రాంతీయ నాయకులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వారి కుటుంబానికి మానసిక ధైర్యం కల్పిస్తూ, పార్టీ తరఫున అన్ని విధాలుగా అండగా ఉంటామని మంత్రి హామీ ఇచ్చారు.

## ఉత్తమ ఉపాధ్యాయులను అభినందించిన కలెక్టర్, డీఈవో



**నాగర్ కర్నూల్, జూలై 5(నీలగిరి ఎక్స్ ప్రెస్):** నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోఎం.ఈ.ఓ లకు, కాంప్లెక్స్ హెచ్.ఎం, గెజిటెడ్ హెచ్.ఎం, కె.జి.బి.వి స్పెషల్ ఆఫీసర్ లకు నిర్వహించిన విద్యాశాఖ సమీక్ష సమావేశంలో రాష్ట్ర స్థాయిలో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం, హైదరాబాద్ లో బెస్ట్ టీచింగ్ ప్రాక్టీసెస్ పై పవర్ పాయింట్ ప్రదర్శన చేసిన టీచర్ గాజుల వెంకటేష్, టీచర్ రఘు రాం, టీచర్ షఫీ లతో ఉత్తమ బోధనా పద్ధతుల ద్వారా నాణ్యమైన విద్యను అందించడం, విద్యార్థుల సంఖ్యను పెంచడం, పాఠశాల అభివృద్ధిలో దాతలు, తల్లిదండ్రులు, సమాజాన్ని భాగస్వామ్యం చేయడం గురించి మాట్లాడించడం జరిగింది. గాజుల వెంకటేష్ గారు మాట్లాడుతూ బాలుర ప్రాథమిక పాఠశాల ఉప్పునుంతలలో ఇంగ్లీష్ మీడియంలో బోధనోపకరణాలతో కృత్యాధార పద్ధతిలో అర్థవంతమైన బోధన చేయడం, స్పోకెన్ ఇంగ్లీష్, గురుకుల పాఠశాలల ప్రవేశాల కోసం ప్రత్యేక తరగతులు, పాఠశాల నుంచి ప్రతి సంవత్సరం గురుకుల సీట్లు సాధిస్తూ ఇప్పటివరకు 49 గురుకుల సీట్లు సాధించడం, తన ఇద్దరు పిల్లలను తాను పనిచేస్తున్న ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించడంతో పాటు ఉపాధ్యాయులు అందరు అంకితభావంతో పనిచేయడంతో విద్యార్థుల సంఖ్య 20 నుంచి 90 కి పెంచడం జరిగిందని, ఆన్లైన్ తరగతుల విని రాష్ట్ర వ్యాప్తంగా వందల మంది విద్యార్థులు గురుకుల సీట్లు సాధించారని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తున్న వీరిని గౌరవ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ అభినందించారు.

## త్యాగనిరతి, అమరత్వానికి ప్రతీక పీర్లపండుగ

-హిందూ, ముస్లిం కలసి చేసుకునే పీర్లపండుగ మతసామరస్యానికి నిదర్శనం
-గట్టుమినయ్యను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన బి.ఆర్.ఎస్ నాయకులు



**వనపర్తి,జులై 5(నీలగిరి ఎక్స్ ప్రెస్):** మొహర్రం సందర్భంగా పీర్లగుట్ట మీద ప్రతిష్ఠించిన గట్టుమీనయ్య(ఇమామ్ హుస్సేన్ పీరు)ను దర్శించుకొని బి.ఆర్.ఎస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్ మాట్లాడుతూ లోకకళ్యాణం కోసం,ప్రజలుసుఖసంతోషాలతో ఉండాలని సైతానులతో పోరాడి అమరత్వం పొందిన ఇమామ్ హుస్సేన్ సోదరులు అమరత్వం పొందిన సందర్భంగా మొహర్రం నిర్వహించబడుతుంది అని అన్నారు.పీర్లగుట్టపై వెలసిన గట్టుమీనయ్య మహిమాన్విత దైవం అని ప్రజల కోరికలు తీర్చే కొంగుబంగారంగా ఈ పీర్లను కొలుస్తారని అన్నారు. ఈ మహిమాన్విత ప్రదేశాన్ని ప్రజల నమ్మకం,విశ్వాసమును ఉంది పీర్లగుట్టనుదైవచింతన,ప్రశాంతత పర్యాటక కేంద్రంగా రూపొందించాలని నందిమల్ల.అశోక్ కోరారు. పూజలు నిర్వహించిన వారిలో మాజీకౌన్సిలర్.బండారు.కృష్ణ,మాజీ వక్ఫ్ బోర్డు సభ్యులు సయ్యద్.జహంగీర్,మాజీ మార్కెట్ డైరెక్టర్ డాక్టర్.డ్యానియల్,తోట.శ్రీను,సాయికుమారు ఉన్నారు.

## వారసత్వ ఆస్తి కేసులో సైఫ్‌కు చుక్కెదురు



**భోపాల్ జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** దివంగత క్రికెటర్ పటౌడీ కుమారుడు బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌కు మధ్యప్రదేశ్ హైకోర్టులో చుక్కెదురైంది. మధ్యప్రదేశ్‌లోని తన పూర్వీకుల ఆస్తులను ఎనిమీ ప్రాపర్టీగా పేర్కొనాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు చేస్తూ సైఫ్ అలీఖాన్ దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టి వేసింది. ఈ ఆస్తికి సంబంధించి ప్రభుత్వానికి హక్కులు సంక్రమిస్తాయి. ఎనిమీ ప్రాపర్టీ కింది ఇవి దఖలు పడ్డాయి. దీనిని సవాల్ చేస్తూ వేసిన పిటిషన్ తిరస్కరణకు గురయ్యింది. సైఫ్ కుటుంబానికి చెందిన రూ.15వేల కోట్ల ఆస్తులను ఎనిమీ ప్రాపర్టీగా నిర్ణయిస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అంతేకాకుండా ఈ విషయంపై మరోసారి విచారణ జరపాలని, ఏడాదిలోగా తుది నిర్ణయం తీసుకోవాలని ట్రయల్ కోర్టును ఆదేశించింది. తాజా పరిణామంతో ఆ ఆస్తుల యాజమాన్య హక్కులపై సందిగ్ధం నెలకొంది. భోపాల్‌లో సైఫ్ కుటు-ంబానికి అతడి నాన్నమ్మ సాజిదా సుల్తాన్ నుంచి పలు విలాసవంతమైన భవంతులు వారసత్వంగా వచ్చాయి. భోపాల్ చివరి నవాబు హమీదుల్లా ఖాన్ కుమార్తె సాజిదా. ఆయన పెద్ద కుమార్తె అబీదా సుల్తాన్ దేశ విభజన నేపథ్యంలో 1950లో పాకిస్థాన్‌కు వలస వెళ్లారు. సాజిదా ఇక్కడే నివసిస్తూ పటౌడీ నవాబు అయిన ఇఫ్తిఖర్ అలీఖాన్(సైఫ్ తా)ను వివాహమాడారు. సాజిదాకు ఆమె తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన ఆస్తులు కాలక్రమంలో ఆమె వారసులైన సైఫ్ కుటు-ంబానికి దక్కాయి. అయితే హమీదుల్లాకు చట్టబద్ధ వారసురాలు అబీదా మాత్రమే అని, ఆమె పాక్‌కు వలస వెళ్లినందువల్ల ఎనిమీ యాక్ట్ ప్రకారం ఆ ఆస్తులను కాందిశీకుల ఆస్తులుగా గుర్తిస్తున్నట్లు కస్టోడియన్ ఆఫ్ ఎనిమీ ప్రాపర్టీ కార్యాలయం 2015లో ప్రకటించింది. దీన్ని సవాలు చేస్తూ సైఫ్ కుటుంబసభ్యులు మధ్యప్రదేశ్ హైకోర్టులో పిటిషన్ వేశారు. తాజాగా దీనిని కోర్టు తిరస్కరించడంతో ఇక ఆశలు వదులుకోవాల్సిందే.

## రైతులకు ట్రాన్స్ఫార్మర్లు ఇవ్వకపోతే సబ్ స్టేషన్ ముట్టడి



**నాగర్ కర్నూల్, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కొల్లాపూర్ నియోజకవర్గ రైతులకు ట్రాన్స్ఫార్మర్లు, మెటీరియల్ అందించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో రైతులతో కలిసి కలెక్టర్ బాదావత్ సంతోష్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. “రైతులు డీడీలు కట్టి అర్హత సాధించినా, ట్రాన్స్ఫార్మర్లు సబ్ స్టేషన్‌లోనే నిలిపివేయడం దారుణం. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడిచినా, కొల్లాపూర్ నియోజకవర్గంలో ఇప్పటికీ రైతులకు ట్రాన్స్ఫార్మర్లు అందడం లేదు” అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**వానాకాలం వచ్చేసినా పంపిణీ లేదు**

వానాకాలం ప్రారంభమైనా, అధికారులు ట్రాన్స్ఫార్మర్ పంపిణీ చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రైతు భరోసా పథకం ద్వారా నష్టపోయిన 6000 మంది చిన్నకారు రైతులకు ఇప్పటికీ ఆర్థిక సాయం అందలేదని తెలిపారు.

**మూడురోజుల్లో చర్యలు తీసుకోకపోతే**

పెద్దకొత్తపల్లి, కొల్లాపూర్, కోడేరు మండలాల్లోని ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్లలో ట్రాన్స్ఫార్మర్లు వెంటనే అందించాలన్న డిమాండ్‌తో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. “వేరుశెనగ సాగు కాలం ప్రారంభమవుతోంది. రైతులకు ఇబ్బంది లేకుండా ట్రాన్స్ఫార్మర్లు అందించాలి. లేకపోతే ముట్టడి కార్యక్రమం చేపడతాం” అని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, ప్రాంతీయ నాయకులు, రైతులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కీవ్‌పై మిస్సైళ్లు, డ్రోన్లతో విరుచుకుపడ్డ రష్యా..




**కీవ్ జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కీవ్‌పై డ్రోన్లు, మిస్సైళ్లతో విరుచుకుపడింది రష్యా. గత మూడేళ్లలో ఇంత భారీ స్థాయిలో రష్యా ఎప్పుడూ దాడి చేయలేదు. బోర్డర్ వద్ద భూమిని ఆక్రమించే ఉద్దేశంతో రష్యా తన దాడి ప్లాన్‌ను మరింత తీవ్ర తరం చేసింది. కీవ్‌లో ఓ వ్యక్తి మృతిచెందగా, మరో 26 మంది గాయపడ్డారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో చాలా కీలక సంభాషణ నిర్వహించినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు. వైమానిక రక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలన్న అంశంపై ఇద్దరు నేతలు డిస్కస్ చేశారు. ఆయుధ ఉత్పత్తి అంశంలోనూ రెండు దేశాల మధ్య చర్చ జరిగింది. రష్యాతో యుద్ధాన్ని ఆపే అంశంపై కూడా ట్రంప్‌తో మాట్లాడినట్లు జెలెన్‌స్కీ తన స్టేట్మెంట్‌లో తెలిపాడు. జెలెన్‌స్కీతో మంచి సంభాషణ జరిగిందని, యుద్ధం ఎప్పుడు ఆగుతుందన్న విషయాన్ని చెప్పలేనని, ఆ విషయం తనకు తెలియదని ట్రంప్ పేర్కొన్నారు. ఇటీవల ఉక్రెయిన్‌కు సైనిక సామాగ్రిని పంపడంలో అమెరికా జాప్యం చేస్తున్నది. కీలకమైన ఎయిర్ డిఫెన్స్ మిసైళ్ల షిప్‌మెంట్ కూడా నిలిచిపోయింది. ఉక్రెయిన్‌లో స్వదేశీ ఆయుధ పరిశ్రమను నిర్మించాలని ఆశిస్తున్నట్లు జెలెన్‌స్కీ తెలిపారు. ఏడు గంటల పాటు తీవ్ర స్థాయిలో వైమానిక దాడి జరిగిందని జెలెన్‌స్కీ చెప్పారు. గత కొన్ని రోజుల నుంచి ఉక్రెయిన్ నగరాలపై రష్యా దాడుల్ని తీవ్రతరం చేసింది. లాంగ్ రేంజ్ దాడులకు దిగుతోంది. వెయ్యి కిలోమీటర్ల బోర్డర్ ఏరియాలో ఉక్రెయిన్ దళాలపై రష్యా తీవ్ర వత్తిడి తెలుస్తున్నది. శుక్రవారం రాత్రి రష్యా సుమారు 550 డ్రోన్లు, మిస్సైళ్లు రిలీజ్ చేసింది. దీంట్లో ఎక్కువ శాతం షాహెద్ డ్రోన్లు ఉన్నాయి. 11 మిస్సైళ్లను కూడా రష్యా వదిలింది.

# మరో 40 ఏళ్లు జీవిస్తా: దలై లామా



**ధర్మశాల: జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బౌద్ధ మత గురువు దలైలామా మరో 40 ఏళ్ల పాటు జీవించాలనుకుంటున్నారు. ప్రస్తుతం ఆయనకు 90 ఏళ్లు నిండాయి. ఈ నేపథ్యంలో ప్రత్యేక కార్యక్రమాలు కూడా ఆర్గనైజ్ చేస్తున్న విషయం తెలిసిందే. అయితే ఇవాళ ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 130 ఏళ్లు వచ్చే వరకు అంటే మరో 40 ఏళ్ల పాటు జీవించే అవకాశాలు ఉన్నట్లు దలైలామా తెలిపారు. సుదీర్ఘమైన ఆయురారోగ్యాలతో ఉండాలని ఆశిస్తూ అనేక మంది బౌద్ధ భక్తులు ఆయన్ను సందర్శిస్తున్నారు. ఆదివారం రోజున దలైలామా 90వ బర్త్‌డే వేడుకలు జరగనున్నాయి. తాను 110 ఏళ్లు జీవించే అవకాశాలు ఉన్నట్లు గత డిసెంబర్‌లో దలైలామా ఓ అంతర్జాతీయ వార్తా సంస్థకు తెలిపారు.

# మధ్యప్రదేశ్‌లో మెలికల వంతెన.

### బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు





**మధ్యప్రదేశ్ జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మధ్యప్రదేశ్ లో బీజేపీ ప్రభుత్వం చేపట్టిన వంతెనల నిర్మాణాలపై విమర్శలు వెలువెత్తున్నాయి. మొన్నటికి మొన్న భోపాల్‌లో 90 డిగ్రీల మలుపుతో నిర్మించిన ఓ రైల్వే వంతెన చర్చనీయాంశం కాగా.. తాజాగా మరో వంతెన తెరపైకి వచ్చింది. భోపాల్‌లోనే పాములా మెలికలు తిరిగిన రైల్వే ఓవర్ బ్రిడ్జి సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లోకి వచ్చింది. సదరు వంతెనపై ప్రయాణాల కారణంగా ఎనిమిది గంటల సమయంలోనే రెండు ప్రమాదాలు జరగడంతో.. వంతెన నిర్మించిన ఇంజినీర్, బీజేపీ ప్రభుత్వ పనితీరుపై వాహనదారులు దుమ్మెత్తిపోస్తున్నారు. వివరాల ప్రకారం.. భోపాల్‌లోని సుభాష్‌నగర్‌లో రూ.40 కోట్లతో ఒక వంతెన నిర్మించారు. ఈ వంతెనను పాములా మెలికలు తిరిగినట్టు నిర్మించడం గమనార్హం. భోపాల్ రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులు ఈ వంతెన మీదుగానే వెళ్లాల్సి ఉంటుంది. అయితే, ఈ వంతెన వల్ల సుభాష్ నగర్ ప్రాంతంలో రద్దీ తగ్గినప్పటికీ దాని నిర్మాణం పలుచోట్ల మెలికలు తిరిగి ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వంతెనపైకి ఎక్కిన కొన్ని సెకన్లలోనే పలుమార్లు మలుపులు తీసుకోవాల్సి వస్తుందని స్థానికులు పేర్కొన్నారు. దీనివల్ల రాత్రి సమయాల్లో, అధిక వేగంతో ప్రయాణించే వాహనదారులు మలుపుల వద్ద నియంత్రణ కోల్పోయి.. ప్రమాదాల బారినపడుతున్నారని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# డెంగ్యూ దాడి.. జాగ్రత్తే రక్ష!







వర్షాకాలం వచ్చిందంటేనే దోమల దందా మొదలవుతుంది. బురద నీరు, చెత్త డబ్బాలు, శుభ్రత లేని చుట్టుపక్కల వాతావరణం ఇవన్నీ ఏడిస్ ఈజిప్టి అనే ప్రమాదకర దోమలకు పుట్టినిల్లు. ఇక ఇది కాటేసిందంటే, డెంగ్యూ అనే వైరస్ జ్వరానికి ఊడిగం పడినట్టే. అధిక జ్వరం, ప్లేట్లెట్ కౌంట్ తగ్గడం, తీవ్రమైన అలసట ఇలా ఒక్కసారిగా జీవన ప్రమాదంగా మారే పరిస్థితులు తలెత్తొచ్చు. కానీ, ఇది నివారించలేనిది కాదు! విజ్ఞానంతో, జాగ్రత్తతో, ప్రజాస్వామ్య బాధ్యతతో ముందడుగు వేస్తే డెంగ్యూకు దారి లేదని గుర్తించాలి.

**డెంగ్యూ ఎలా గుర్తించాలి?**
డెంగ్యూలో వచ్చే లక్షణాలు మొదటే శరీరాన్ని బలహీనంగా చేస్తాయి.

**ముఖ్యంగా:**
- ఒక్కసారిగా వచ్చే అధిక జ్వరం
- తలనొప్పి, కళ్ల వెనక భాగంలో నొప్పి
- చర్మంపై ఎరుపు చిమ్మటిదద్దుర్లు
- ముక్కు, దంతాల నుంచి రక్తస్రావం
- కండరాలు, కీళ్ల నొప్పులతో మలమలలు
- తీవ్ర అలసట, నీరసం

ఈ లక్షణాలు కనబడిన వెంటనే ఆసుపత్రి దారి పట్టాలి. ఆలస్యం ప్రాణాపాయానికి దారితీయవచ్చు.

**నిర్ధారణే ఉపశమనం**
జ్వరం వచ్చిన రెండు మూడు రోజుల్లోనే రక్తపరీక్షలు చేయించుకోవాలి.

**ముఖ్యంగా:**
- NS1 Antigen Test - ప్రారంభ దశలో
- ఐజీఎం, అంటిబాడి టెస్ట్స్ - ప్రస్తుత, పాత ఇన్‌ఫెక్షన్‌కు
- సీబీసీ - ప్లేట్లెట్ స్థాయిల గమనికకు
- ఆర్టీ- పీసీఆర్ టెస్ట్ - ఖచ్చితమైన వైరస్ గుర్తింపుకు
- లివర్ ఫంక్షన్ టెస్ట్ - కాలేయంపై ప్రభావం తెలుసుకోడానికి

ఈ పరీక్షల ద్వారా చికిత్స దిశ మారుతుంది. ఆరోగ్యానికి ముందస్తు సమాచారమే ఆయుధం!

**డెంగ్యూలో ఆహారం ..ఔషధమే!**
డెంగ్యూ నుంచి త్వరగా కోలుకోవాలంటే సరైన ఆహారం కీలకం.

**ముఖ్యంగా తినవలసినవి:**
- పపాయా, మోసంబి, నిమ్మ - ప్లేట్లెట్లు పెరగటానికి
- ఆకుకూరలు - ఐరన్, ఫోలేట్ అధికం
- కొబ్బరి నీరు, నిమ్మ శరబత్ - హైడ్రేషన్‌కి
- ఉడికిన గుడ్లు, పప్పులు, లైట్ సూపులు - శక్తి నిలుపుకోవటానికి

**మానవలసినవి:**
- బజ్జీలు, సమోసాలు, చిప్స్ వంటి ఆయిల్ ఫుడ్స్
- కార్బనేటెడ్ డ్రింక్స్, ప్రిజర్వేటివ్ జ్యూస్
- ఆల్కహాల్, ఆస్పిరిన్, ఐబుప్రోఫెన్ - ప్రమాదకరం
- మాంసాహారం - తక్కువ మోతాదులో మాత్రమే

పౌష్టికాహారం, నీటి వినియోగం, విశ్రాంతి - ఇవే డెంగ్యూలో తిరిగి నిలబడే సూత్రాలు! హోమియోపథీకి చోటుంది కానీ .. డెంగ్యూ లాంటి వైరల్ జ్వరాలకు హోమియోపథీ విధానాలు రోగనిరోధక శక్తిని పెంచడంలో కొంతమేర ఉపకరిస్తాయి. అయితే, స్వచ్ఛంధంగా మందులు వాడడం ప్రమాదకరం. నిపుణుల సలహాతోనే మెడిసిన్లు వాడాలి.

**డెంగ్యూలో అత్యవసర సంకేతాలు ఇవే:**
- ప్లేట్లెట్ కౌంట్ 20,000 కంటే తక్కువ
- శ్వాసలో ఇబ్బంది
- ఎడమ పక్క, కడుపు నొప్పులు
- తీవ్రమైన అలసట, నీరసం
- నిరంతర రక్తస్రావం

ఈ పరిస్థితులు ఎదురైతే తక్షణమే ఆసుపత్రికి చేరాలి.

**ప్రజలే ముందుకు రావాలి!**
డెంగ్యూ వ్యాధిని నివారించాలంటే ప్రభుత్వ మాత్రమే కాదు - ప్రతి ఒక్కరికి బాధ్యత ఉంది. ఇంటి ఆవరణల్లో నీరు నిల్వ ఉండనీయకండి. పాత డబ్బాలు, చీపురు, కిందపడి ఉన్న పాత ప్లాస్టిక్‌లు తొలగించండి. దోమల నివారణకు చర్యలు తీసుకోండి. ఈ విషయంలో శ్రద్ధ తీసుకుంటే ం డెంగ్యూను పూర్తిగా అరికట్టడం సాధ్యమే!
డెంగ్యూకు దోమలే మూలం, మనం మూలంగా నివారించాలి! వైద్య శాస్త్రం ఎంతగా అభివృద్ధి చెందినా జాగ్రత్తలు తీసుకోకపోతే చుక్కలు త్రాగక తప్పదు. డెంగ్యూకు ఔషధమేమీ లేదన్న వాస్తవాన్ని మనసుపెట్టుకుని ముందస్తు జాగ్రత్తలు, నిరంతర శుభ్రత, వైద్యుల సలహాతోనే తగిన చికిత్స తీసుకోవాలి.ప్రతి ఇంటి శుభ్రతే సమాజానికి రక్షణ కవచం! ప్రతి దోమ నివారణే ప్రాణాలను నిలబెట్టే చర్య!


వ్యాసకర్త
డాక్టర్.వాస సింధూజ



# అతనిదంతా క్రిమినల్ మనస్తత్వం

### క్రికెటర్ షమీపై మాజీ భార్య హసీన్ జహాన్

**కోల్‌కతా జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
టీమ్‌ఇండియా సీనియర్ బౌలర్ మహ్మద్ షమీపై అతడి మాజీ భార్య హసీన్ జహాన్ సంచలన ఆరోపణలు చేశారు. అతడో కర్కశ వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి అని దుయ్యబట్టారు. ఇటీవల విడాకుల సందర్భంగా తనకు ఇచ్చే భరణం సరిపోదని ఆమె తెలిపింది. తాజాగా అతడు వ్యక్తిత్వం లేని, క్రూరమైన మనస్తత్వం కలిగిన వాడని, అందుకే తనను ఎంతగానో వేధించాడని ఆమె ఆరోపించారు. వీరి విడాకుల కేసుకు సంబంధించి ఇటీవల కలకత్తా హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. 2018లో హసీన్ అతడిపై గృహహింస కేసు పెట్టింది. దీనిపై కొన్నేళ్లుగా విచారణ జరుగుతోంది. ఈ క్రమంలోనే ఇటీవల హసీన్, ఆమె కుమార్తె సంరక్షణ కోసం రూ.4 లక్షలను భరణం కింద చెల్లించాలని షమీని కలకత్తా హైకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో షమీని విమర్శిస్తూ




హసీన్ జహాన్ ఇన్‌స్టా వేదికగా సుదీర్ఘ పోస్ట్ చేశారు. గత ఏడేళ్లుగా మన మధ్య న్యాయపోరాటం జరుగుతోంది. నీ క్యారెక్టర్ లేనితనం, దురాశ, క్రూరమైన మనస్తత్వంతో సొంత కుటుంబాన్నే చేజేతులా నాశనం చేశావ్. మమ్మల్ని చంపడానికి, మా పరువు తీసి వేధించడానికి, నన్ను ఓడించడానికి నువ్వు ఎంతమంది క్రిమినల్స్‌కు డబ్బు ఇచ్చి ఉంటావ్. దానివల్ల నువ్వు ఏమైనా సాధించావా? పురుషాధిక్య సమాజంలో నాపై నిందలేసి నువ్వు మద్దతు కూడగట్టు-గలవేమో..! కానీ, ఏదో ఒకరోజు నీకు కూడా కష్టకాలం మొదలవుతుంది. అప్పుడు నీకు అండగా నిలిచినవాళ్లే నిన్ను తరిమేస్తారు. చట్టంపై నాకు నమ్మకం ఉందని షమీని ఆమె దుయ్యబట్టారు. క్రిమినల్స్, వేశ్యలకు నువ్వు ఇచ్చిన డబ్బును.. మన కుమార్తె చదువు కోసం వెచ్చించి ఉంటే, మన భవిష్యత్తు కోసం ఉపయోగించి ఉంటే ఇప్పుడు మన జీవితం ఎంతో బాగుండేది. మనమంతా ఎంతో మర్యాదగా జీవించేవాళ్లం అంటూ హసీన్ జహాన్ రాసుకొచ్చారు. నాకు ఆ భగవంతుడు ఎంత ధైర్యాన్ని, సహనాన్ని ఇచ్చాడో చూడు. నిజం కోసం నేను ఏళ్లతరబడి పోరాడుతూనే ఉన్నాను... ఉంటాను కూడా. అందుకే, నువ్వు ఎంతమంది క్రిమినల్స్‌తో చేతులు కలిపినా నన్ను ఏమీ చేయలేకపోతున్నావ్. ఈ 2014లో హసీన్‌తో షమీకి వివాహమైంది. వీరికి కుమార్తె జన్మించింది. అయితే, ఆ తర్వాత వీరిద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో విడివిడిగా ఉంటున్నారు.